


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162






ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 274 | మంగళవారం 13 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3


## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

### ఆమ్రపాలికి కీలక శాఖ



- ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

2లో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ



# తిరుపతికి మహర్దశ

### రూ.3,222 కోట్లతో అభివృద్ధి పనులు

- 'తుడా' పరిధిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- శ్రీవారి భక్తుల కోసం భారీ వసతి, అన్నప్రసాద సముదాయాల నిర్మాణం
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి
- నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేలా 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

2లో

తిరుపతి పుణ్యక్షేత్రం అభివృద్ధిలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో మొత్తం రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. అమరావతిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చడం, నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులలో అత్యంత కీలకమైనది ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్. తిరుమల కొండపై రద్దీని తగ్గించే లక్ష్యంతో కొండ కిందనే భక్తులకు అవసరమైన అన్ని



## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..

### విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు 2లో
- విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన
- త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

## ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

2లో



- ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో పిటిషన్
- రాహుల్ గాంధీ సహా 11 మంది 'ఇండియా' కూటమి నేతల పిటిషన్
- ఓటర్లను భారీగా తొలగించారని, అవకతవకలు జరిగాయని ఆరోపణ
- సీజేఐ సూచన మేరకే కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించిన రాహుల్
- విపక్షాల ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపక్షాల మధ్య

## ఇది ఓట్ల దొంగతనమే : మంత్రి శ్రీధర్ బాబు

- ఓటర్ల జాబితా సవరణపై ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన
- ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, నేతలు
- సీఈసీని తొలగించాలని డిమాండ్

2లో



## విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

### నలుగురి సజీవదహనం

2లో

విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు



## పల్నాడు లోకల్ ఫైట్




పల్నాడు గడ్డపై స్థానిక సంస్థల సమరశంఖం పూరించేందుకు సర్వం సిద్ధమైంది. ఒకవైపు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు యంత్రాంగం క్షేత్రస్థాయిని జల్లెడ పడుతుండగా, మరోవైపు అధికార యంత్రాంగం ఓటర్లు, పోలింగ్ కేంద్రాల లెక్కలను పక్కాగా తేల్చేసింది. కొన్ని గంటల్లో మున్సిపల్ ఛైర్మన్లు, వార్డుల రిజర్వేషన్లు తేలనుండటం, బుధవారమే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండటంతో జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా కాక పెరిగింది. బీసీలకు పెద్దపీట వేస్తూ కూటమి వ్యూహాత్మక అడుగులు వేయగా, పట్టు నిలుపుకోవాలని వైకాపా బలమైన అభ్యర్థుల వేటను ముమ్మరం చేసింది. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు క్షణం తీరికలేని రీతిలో షెడ్యూల్ సిద్ధం కావడంతో, రాజకీయ పార్టీల్లో ఇప్పుడే అసలైన యుద్ధ వాతావరణం నెలకొంది స్థానిక సమరానికి అంతా సిద్ధమైంది. ఎన్నికల కోసం ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు పోలీసుశాఖ సన్నద్ధం అవుతోంది.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే..

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఏపీ రైతు బజార్లలో కెఎన్‌ఎం సన్నబియ్యం విక్రయాలు
- రూ.49కే అందుబాటులో ఉన్న బీపీటీ బియ్యం
- పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్య
- ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాక్

2లో

సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్‌ఎం, ఆర్‌ఎన్‌ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్‌ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది.



## ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు..

### రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు



కేరళ నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్
తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్
కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకూ కొత్త గవర్నర్లు
బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియామకాలు అమల్లోకి

2లో

దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు. వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు.

# కౌన్ బనేగా మేయరమ్మ

గుంటూరు నగర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

మహిళా రిజర్వేషన్‌తో మారిన ఆశావహుల లెక్కలు

సామాజిక ప్రాతినిధ్యం.. పార్టీ సేవలు.. కుటుంబ నేపథ్యాలకు ప్రాధాన్యం

6 డివిజన్లలో పట్టు కోసం పార్టీల వ్యూహాలు

2లో



గుంటూరు నగర మేయర్ పీఠం చుట్టూ రాజకీయ వేడి పెరుగుతోంది. మహిళలకు మేయర్ పదవి కేటాయించడంతో అధికార తెలుగుదేశం పార్టీలో అభ్యర్థి ఎంపికపై కసరత్తు ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు పురుష నాయకుల రాజకీయ ప్రాధాన్యంతో సాగిన మేయర్ చర్చలు ఇప్పుడు మహిళా నాయకత్వం, సామాజిక సమీకరణాలు, కుటుంబ రాజకీయ నేపథ్యాల చుట్టూ తిరుగుతున్నాయి. మాదల చైతన్య సతీమణి మాదల మీన రత్న సిమ్స్ విద్యాసంస్థల అధినేత శివశిరీష, పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని) భార్య లక్ష్మీ అపర్ణ, డాక్టర్ శనక్కాయల రాజకుమారి పేర్లు కూడా చర్చలో ఉన్నాయి. పార్టీకి ఉన్న రాజకీయ అవసరాలు, ఆశావహుల నేపథ్యాలు, నగరంలో సామాజిక ప్రాతినిధ్యం, కూటమి సమన్వయం వంటి అంశాల ఆధారంగా

## ఇది ఓట్ల దొంగతనమే: మంత్రి శ్రీధర్ బాబు

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ, సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేస్తామని ఈ సందర్భంగా నేతలు హెచ్చరించారు. ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

## విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పల్నాడు లోకల్ ఫైట్

ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జగదీశ్ ఆదహళ్లి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు రిజర్వేషన్ల ప్రక్రియ కూడా కొన్ని గంటల్లో తేలనుంది. సోమవారం మున్సిపల్ వార్డులు, చైర్మన్ల రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఇవి ప్రకటించిన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడదల చేయనున్నారు. **లెక్క తేల్చారు** : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు సర్వసిద్ధంగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 28 మండలాలు , 525 పంచాయతీలు , 5,406 వార్డులు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 5,476 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 1,694 సమస్యాత్మక గ్రామాలు. 2,066 అతి సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు పోలీసులు లెక్కతేల్చారు. జిల్లాలో 28 జడ్పీటీసీలు, ఎంపీపీలు, 434 ఎంపీటీసీలు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్తు ఎన్నికలకు సంబంధించి 1,610 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 12,89,165 ఉంటే ఇందులో పురుషులు 6,33,118 మహిళలు : 6,55,951 ఇతరులు 96 మంది ఉన్నారు. పురుషుల కంటే **మహిళలే నిర్ణేతలు** : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించింది. చట్ట బద్ధంగా అది సాధ్యం కాకపోవడంతో పార్టీ పరంగా ఆ వర్గాలకు పెద్దపీట వేసేందుకు సంకల్పించింది. కోర్టుల్లో బీసీ రిజర్వేషన్‌కు చుక్కెదురైన నేపథ్యంలో పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేస్తున్నట్టు కూటమి నేతలు వెల్లడించారు. స్థానిక సంస్థల అన్ని ఎన్నికల్లో బీసీలకు 34 శాతం సీట్లు కేటా యించనున్నారు. 2001 ఎన్నికల్లో జిల్లాలో 519 పంచాయతీలకు ఎన్నికల నిర్వహించగా 99 పంచాయతీలను బీసీలకు కేటాయించారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో 530 పంచాయతీలకు 180 పంచాయతీల్లో బీసీలు సర్పంచ్‌లుగా పోటీ చేసే అవకాశాన్ని కూటమి కల్పించింది. 5440 వార్డులకు బీసీలకు 1,849 కేటాయించారు. ఐదు మున్సిపాల్టీలు, రెండు నగర పంచాయతీల్లో 295 వార్డులకు 100 స్థానాల్లో బీసీ వర్గాలు పోటీ చేసే అవకాశం దక్కింది. చిలకలూరిపేట, నరసరావుపేటలో 16, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల మున్సిపాల్టీల్లో 12 స్థానాల చొప్పున, పిడుగురాళ్లలో 13, దాచేపల్లిలో 9, గురజాలలో 7 వార్డులను బీసీలకు కేటాయించనున్నారు. జిల్లాలో 425 ఎంపీటీసీలకు 114, 28 జడ్పీటీసీల్లో 9 స్థానాలను బీసీలకు కూటమి కేటా యించనున్నది. బీసీల విషయంలో కూటమి తీసుకున్న నిర్ణయంతో వైసీపీ కూడా బీసీలకు సీట్లు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ** : మున్సిపల్ ఎన్నికల నగారా మోగే తరుణంలో అత్యంత కీలకమైన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ పదవులతో పాటు కౌన్సిలర్ వార్డుల రిజర్వేషన్ల వెల్లడిపై అధికార యంత్రాంగం వేగంగా కసరత్తు పూర్తి చేస్తోంది. రాష్ట్రంలోని మున్సిపల్, నగర పంచాయతీ ఛైర్మన్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. రొటేషన్ విధానం: మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణిస్తూ, రొటేషన్ పద్ధతి ఆధారంగా ఛైర్మన్ స్థానాల రిజర్వేషన్లను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఖరారు చేస్తోంది. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు గరిష్ఠ పరిమితికి లోబడి ఉండేలా ఈ స్థానాలను కేటాయిస్తున్నారు. పురపాలక సంఘాల్లోని వార్డులకు సంబంధించిన కౌన్సిలర్ స్థానాల రిజర్వేషన్లను మంగళవారం నాడు ప్రకటించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కౌన్సిలర్ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను జిల్లా యూనిట్‌గా తీసుకొని సంబంధిత జిల్లా కలెక్టర్లు ప్రకటిస్తారు. జనాభా ప్రాతిపదికన, గత ఎన్నికల రొటేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ఏయే వార్డులు ఏ వర్గాలకు, మహిళలకు కేటాయించాలనే జాబితాను జిల్లా యంత్రాంగం తుది పరిశీలన చేస్తోంది.ఛైర్మన్, కౌన్సిలర్ స్థానాల రిజర్వేషన్లు వెలువడనుండటంతో పురపాలక పోరులో పోటీకి సిద్ధమవుతున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల వివరాలు అధికారికంగా వెల్లడి కాగానే స్థానిక రాజకీయ సమరం మరింత ఊపందుకోనుంది.

**స్థానిక పోరుకు నేతలు సై** జిల్లాలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమయ్యాయి. స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రకటనపై స్పష్టత రావడంతో ఆశావహుల జాబితా సిద్ధం చేసుకుంటున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీల నుంచి పదవులకు నేతలు, కార్యకర్తల నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది. వైసీపీకి కొన్నిచోట్ల అభ్యర్థులు ముందుకురాకపోగా.. బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారైన తర్వాత.. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు కేటాయించే స్థానాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. కార్యకర్తలు, నేతల నుంచి వస్తున్న వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు.. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నిర్ణయం తీసుకుందామని వేచి చూసే ధోరణిలో ఉన్నారు క్షేత్రస్థాయిలో పదవులకు సంబంధించి ప్రతి నియోజకవర్గంలో సమన్వయ కమిటీలను వేసి, వారి ఆధ్వర్యంలో జాబితాలు తయారు చేయనున్నారు. **సమయం లేదు మిత్రమా..** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనుండటంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం (14న) ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనుండగా, అదే రోజు మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడనుంది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళి (కోడ్) అమల్లోకి రానుండటంతో పాటు నామినేషన్లు, ప్రచారానికి అతి తక్కువ గడువు ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర హడావిడి మొదలైంది. షెడ్యూల్ వెలువడిన మూడో రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలై, కేవలం ఐదు రోజుల పాటు మాత్రమే గడువు ఉండనుంది. పరిశీలన, ఉపసంహరణ: ఆరో రోజు నామినేషన్ల పునఃపరిశీలన, ఎనిమిదో రోజు ఉపసంహరణ ప్రక్రియ ముగియగానే బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ఖరారవుతుంది. తుది జాబితా తేలిన తర్వాత ప్రచారానికి కేవలం ఆరు రోజుల వ్యవధి మాత్రమే లభించనుంది. 15వ రోజున పోలింగ్, 18వ రోజున ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించనున్నారు. పరిషత్, పంచాయతీ పోరు: మరోవైపు నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను 16 రోజుల్లో, గ్రామ పంచాయతీల ప్రక్రియను కేవలం 14 రోజుల్లో పూర్తి చేసేలా కమిషన్ ఏర్పాట్లు చేసింది. కాల వ్యవధి చాలా పరిమితంగా ఉండటంతో అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు ప్రతి అడుగూ క్షణాల మీద తేల్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు పరిపాలనా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేస్తుండగా, మరోవైపు స్థానిక రాజకీయం ఎన్నికల రణక్షేత్రాన్ని తలపిస్తోంది.ప్రచారానికి లభించేది కేవలం ఆరు రోజులే కావడంతో వార్డులు, గ్రామాల పరిధిలో ఓటర్లను నేరుగా ప్రసన్నం చేసుకునేందుకు ప్రణాళికలు, ప్రచార సామగ్రి సిద్ధం చేసుకోవడంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. రిజర్వేషన్ల ప్రకటనతో మొదలై ఫలితాల వెల్లడి వరకు ప్రతి రోజూ రాజకీయ వర్గాలకు అగ్నిపరీక్షే.

## ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు.. రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు

ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది.ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

# కౌన్ బనేగా మేయరమ్మ

తుది ఎంపిక జరిగే అవకాశముంది. దీంతో గుంటూరు మేయర్ అభ్యర్థిత్వం నగర రాజకీయాల్లో కీలక అంశంగా మారింది.

**మీనా రత్న.. స్వాతంత్ర్య పోరాట వారసత్వం** మాదల చైతన్య సతీమణి మాదల మీనా రత్న పేరు మేయర్ అభ్యర్థిత్వ చర్చలో ప్రాధాన్యం పొందుతోంది. స్వాతంత్ర్య పోరాటంతో అనుబంధమున్న కుటుంబ నేపథ్యం, ప్రజాసేవతో ముడిపడిన వారసత్వం ఆమె పేరును ప్రత్యేకంగా నిలుపుతున్న అంశాలుగా ప్రస్తావనకు వస్తున్నాయి. గత తరాల పోరాట స్ఫూర్తిని ప్రస్తుత ప్రజాజీవితంతో అనుసంధానించే కుటుంబ నేపథ్యం రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వస్తోంది. మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో వివిధ కుటుంబాల నుంచి ఆశావహుల పేర్లు తెరపైకి వస్తున్న తరుణంలో మీనా రత్న పేరు కూడా చర్చలో ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. కుటుంబ నేపథ్యంతోపాటు ప్రజలతో సంబంధాలు, రాజకీయ అనుబంధం, స్థానికంగా ఉన్న గుర్తింపు వంటి అంశాలు అభ్యర్థిత్వ పరిశీలనలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

**శివశిరీష పేరు చుట్టూ సామాజిక సమీకరణాలు** మేయర్ అభ్యర్థిత్వ చర్చలో శివశిరీష పేరు ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తోంది. విద్యారంగంతో ఆమెకు ఉన్న అనుబంధం, సిమ్స్ విద్యాసంస్థల నిర్వహణ నేపథ్యం, భర్త భీమనాథం భరత్ రెడ్డికి టీడీపీతో ఉన్న రాజకీయ సంబంధాలు ఈ చర్చలో భాగమవుతున్నాయి. గుంటూరులో వివిధ సామాజికవర్గాల ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయాల నేపథ్యంలో ఆమె పేరు ప్రస్తావనకు వస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలో బ్రాహ్మణ సామాజికవర్గ ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. 45 వేలకుపైగా ఓటర్లు ఉన్నారనే ప్రచారానికి అధికారిక గణాంకాల నిర్ధారణ అవసరం. సామాజిక సమీకరణాలతోపాటు పార్టీ నాయకత్వం అభిప్రాయాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ఎన్నికల వ్యూహం కూడా అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారనున్నాయి.

**లక్ష్మీ అపర్ణ.. పార్టీ సేవలకు గుర్తింపు** మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని) భార్య లక్ష్మీ అపర్ణ పేరును కూడా ఆశావహుల జాబితాలో ప్రస్తావిస్తున్నారు. గుంటూరు నగరంలో టీడీపీ బలోపేతానికి నాని చేసిన కృషి, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన నేపథ్యాన్ని ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి ఆయన కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.గతంలో నాని మేయర్‌గా పనిచేసిన కాలం ఏడాదికే పరిమితమైందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. మహిళలకు పదవి కేటాయించిన నేపథ్యంలో లక్ష్మీ అపర్ణకు అవకాశం కల్పించడం ద్వారా పార్టీ సేవలకు గుర్తింపు ఇవ్వాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ అంశం కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలన, రాజకీయ వ్యూహంపైనే ఆధారపడి ఉంటుంది.

**డాక్టర్ శనక్కాయల రాజకుమారి పేరు కూడా చర్చలో**

మేయర్ పదవిని ఆశిస్తున్న వారిలో డాక్టర్ శనక్కాయల రాజకుమారి పేరు కూడా వినిపిస్తోంది. పలువురు ఆశావహుల పేర్లు ప్రస్తావనకు రావడంతో అభ్యర్థి ఎంపికలో పార్టీ నాయకత్వం వివిధ అంశాలను సమన్వయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా ఉన్న పరిచయాలు, రాజకీయ అనుబంధం, ప్రజా సంబంధాలు వంటి అంశాలు కూడా ఈ చర్చలో భాగమవుతున్నాయి. ఒకరికి అవకాశం కల్పించినప్పుడు మిగిలిన ఆశావహులను సమన్వయం చేసుకోవడం, పార్టీ శ్రేణుల్లో ఐక్యతను కొనసాగించడం కీలకం కానుంది. అందువల్ల అభ్యర్థి ఎంపికతోపాటు నగరవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఒకే తాటిపైకి తీసుకురావడం కూడా నాయకత్వానికి ముఖ్యమైన బాధ్యతగా మారనుంది.

**కూటమి రాజకీయాలు.. అధిష్ఠానం కసరత్తు** గుంటూరు మేయర్ అభ్యర్థి ఎంపికలో టీడీపీ అంతర్గత సమీకరణాలతోపాటు జనసేన, బీజేపీలతో సమన్వయం కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది. స్థానికంగా కూటమి పార్టీల బలాబలాలు, నాయకుల అభిప్రాయాలు, ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.సామాజిక ప్రాతినిధ్యం ఒకవైపు, పార్టీ సేవలకు గుర్తింపు మరోవైపు, రాజకీయంగా విస్తృత సమన్వయం ఇంకోవైపు.. ఈ మూడు అంశాల మధ్య సమతూకం సాధించడం అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారనుంది. ఆశావహుల మధ్య పోటీ ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠ నెలకొంది.

## సొంతింటి కలకు చెల్లింపుల అడ్డంకి!.. ఇందిరమ్మ టవర్ అందని ద్రాక్షేనా?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే పేద, అల్పాదాయ కుటుంబాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంలో చెల్లింపుల అంశం కీలకంగా మారింది. తొలి వాయిదాగా రూ.లక్ష చెల్లించేందుకు విధించిన గడువు ముగియడంతో తాత్కాలిక కేటాయింపు పత్రాలు పొందిన లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అక్టోబర్ 9లోగా చెల్లింపులు చేయని వారి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ రద్దయ్యే అవకాశం ఉందని తెలంగాణ హౌసింగ్ బోర్డు స్పష్టం చేసినట్లు సమాచారం. గడువు పొడిగింపు ఉండదన్న సంకేతాలతో లబ్ధిదారులు చెల్లింపుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఒకవైపు నిర్ణీత గడువులోగా తొలి వాయిదా చెల్లించాల్సి ఉండగా, మరోవైపు బ్యాంకు రుణం పొందేందుకు అవసరమైన పత్రాల విషయంలోనూ కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయని వారికి రుణాల మంజూరులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో ఇల్లు దక్కినా, మిగిలిన మొత్తాన్ని ఎలా సమకూర్చుకోవాలన్న ఆందోళన కొందరు లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది.గతంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లలో కొన్ని ఇప్పటికీ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదన్న విమర్శల నేపథ్యంలో, ఇందిరమ్మ టవర్స్ పథకం అమలు తీరుపై ఆసక్తి నెలకొంది.

**రూ.లక్ష చొప్పున రూ.55.01 కోట్ల వసూళ్లు** తాత్కాలిక కేటాయింపు పత్రాలు పొందిన 5,501 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు తొలి వాయిదాగా రూ.లక్ష చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన మొత్తం రూ.55.01 కోట్లు వసూలు కావాలి. వీరిలో 3,271 మంది ఇప్పటికే చెల్లింపులు చేయడంతో రూ.32.71 కోట్లు సమకూరాయి. మరో 2,230 మంది చెల్లించాల్సిన మొత్తం రూ.22.30 కోట్లు. అంటే మొత్తం లబ్ధిదారుల్లో 59.46 శాతం మంది మాత్రమే తొలి వాయిదా చెల్లించగా, 40.54 శాతం మంది చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

**రూ.11 లక్షల ఫ్లాట్.. రూ.5 లక్షల సబ్సిడీ** ఈ పథకంలో ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం సుమారు 528 చదరపు అడుగులు కాగా, కార్పెట్ ఏరియా 480 చదరపు అడుగులుగా ఉంటుంది. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయాన్ని సుమారు రూ.11 లక్షలుగా అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షలను సబ్సిడీగా భరిస్తుండగా, మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారులు విడతల వారీగా చెల్లించాలి. భూమి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ఫ్లాట్‌తో పాటు భూమిలో అవిభాజ్య వాటాను కూడా లబ్ధిదారులకు కల్పించనున్నారు.

**చెల్లించకుంటే వెయిటింగ్ లిస్టులోని వారికి అవకాశం**

నిర్ణీత గడువులోగా తొలి వాయిదా చెల్లించని వారి తాత్కాలిక కేటాయింపులు రద్దయితే, సంబంధిత ఫ్లాట్లను వెయిటింగ్ లిస్టులో ఉన్న అర్హులకు కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుతం సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులు తదుపరి అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. అయితే, వారందరికీ ఫ్లాట్లు కేటాయిస్తారని భావించరాదు. రద్దయ్యే కేటాయింపుల సంఖ్య, అందుబాటులో ఉన్న ఫ్లాట్లు, అర్హతలు, నిబంధనల ఆధారంగానే తదుపరి ప్రక్రియ కొనసాగుతుంది.

**ఏడాదిలో నిర్మాణం పూర్తి చేస్తామని హామీ**

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందజేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. మరోవైపు, హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతమ్ కూడా లబ్ధిదారులు అక్టోబర్ 9 గడువును దృష్టిలో ఉంచుకుని చెల్లింపులు పూర్తి చేయాలని కోరినట్లు సమాచారం. గడువు పొడిగింపు ఉండదన్న సంకేతాల నేపథ్యంలో తొలి విడతలో ఎంపికైన వారు చెల్లింపులు చేయడం కీలకంగా మారింది.

# తిరుపతికి మహర్దశ..

సౌకర్యాలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2,700 గదుల వసతి సముదాయాలను నిర్మించనున్నారు. దీనివల్ల రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుంది. అలాగే, ఒకేసారి 6 వేల మందికి అన్నప్రసాదం అందించేలా రూ.160 కోట్లతో భారీ అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. రూ.486 కోట్లతో నిర్మించే నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లలో ఒకేసారి 16 వేల మంది భక్తులు స్నానం, విశ్రాంతి తీసుకునే సౌకర్యం కలుగుతుంది. వీటితో పాటు రూ.311 కోట్లతో 4,500 వాహనాలకు సరిపడా బహుళ అంతస్తుల పార్కింగ్, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగమే. మరోవైపు, టీటీడీ ఉద్యోగుల దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు. నగర అభివృద్ధిలో భాగంగా, తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో తిరుపతి రూపురేఖలు మారి, ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి. రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

**రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:**

ఎస్టీ (ఒకటి): మంగళగిరి–తాడేపల్లి

ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు

బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ

బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు

జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం

అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

**ఇతర ముఖ్య నియామకాలు ఇలా ఉన్నాయి:**

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి. కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.

**గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.**

**ఇద్దరికి అదనపు బాధ్యతలు** ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

## ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఎ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝీ, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది. అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

**విపక్షాల ఆరోపణలు నిరాధారం: బీజేపీ** 'ఇండియా' కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయ ప్రదర్శనగా మార్చాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ విమర్శించారు. ఆయన ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "విపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారం. వారు అబద్ధాలు చెబుతున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది" అని స్పష్టం చేశారు. అస్సాంలోని సిల్చర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓడిపోతున్నందునే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.

ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# నంద్యాలలో అత్యాధునిక 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఘన ప్రారంభం





### ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 12 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ సమీపంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ డి. కీర్తి రెడ్డి ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్" సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "నంద్యాల పట్టణంలో అత్యాధునిక వసతులతో 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఏర్పాటు కావడం ఎంతో అభినందనీయమన్నారు. గతంలో తీవ్రమైన కిడ్నీ, యూరాలజీ సమస్యలొస్తే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కర్నూలు లేదా బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని . ఇప్పుడు అలాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు స్థానికంగానే నంద్యాల ప్రజల చెంతకు రావడం సంతోషకరమన్నారు . యువ వైద్యులైన డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ డి. కీర్తి రెడ్డి లు ఉన్నత వైద్య విద్యను అభ్యసించి, తమ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించడం హర్షణీయమైన విషయం అన్నారు . పేద, మధ్యతరగతి ప్రజలకు భారం కాకుండా మానవతా దృక్పథంతో, నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరుతున్నానని తెలిపారు . శ్రీ ధన్వి హాస్పిటల్ ప్రజల మన్ననలు పొందుతూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, వైద్యుల బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి (యూరాలజిస్ట్), డాక్టర్ డి. కీర్తి రెడ్డి (నెఫ్రాలజిస్ట్) మాట్లాడుతూ "నంద్యాల పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్'ను స్థాపించడం జరిగిందని తెలిపారు . ముఖ్యంగా కిడ్నీ, మూత్రపిండాల సంబంధిత వ్యాధులకు అధునాతన పరికరాలు, నిపుణుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. రోగుల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 24 గంటల ఎమర్జెన్సీ సేవలతో పాటు, అధునాతన ల్యాబ్, ఫార్మసీ సేవలను కూడా ఒకే చోట సమకూర్చామన్నారు . పెద్ద నగరాలకు వెళ్లే పనిలేకుండా ఇక్కడే అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించడమే మా ప్రధాన ధ్యేయం అన్నారు . మా ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీస్సులు అందించిన గౌరవ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , ఎమ్మెల్యే అఖిల ప్రియ,మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి,రామకృష్ణ విద్యాసంస్థల చైర్మెన్ జి.రామకృష్ణా రెడ్డి,టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, ఇతర అతిథులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ." ఈ కార్యక్రమంలో విద్యాసంస్థలు అధినేత మధుసూదన్ రెడ్డి , కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, మాజీ కౌన్సిలర్ కండే శ్యాంసుందర్ లాల్, బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, అనుపూర్ ఈశ్వర్, చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పసుపులేటి జనార్ధన్, డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు





# మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఏపీ జేపీఎస్ నాయకుల సన్మానం

### జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సమితి కృషి యూనియన్ లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణను వివరించిన రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 12** డోన్ పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి (ఏపీ జేపీఎస్) నాయకులు రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించడంతో పాటు జ్ఞాపికను అందజేశారు.ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి ఏర్పాటు అనంతరం మర్యాదపూర్వకంగా మాజీ మంత్రిని కలిసిన రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు.. సమితి ఏర్పాటు లక్ష్యాలు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు చేపట్టనున్న కార్యక్రమాలు, పాత్రికేయుల సంక్షేమం కోసం భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యాచరణను వివరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడమే సమితి ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం** ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు నిరంతరం కృషి చేస్తున్నారని ఏపీ జేపీఎస్ నాయకులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమితి ప్రత్యేక దృష్టి సారిస్తుందని వివరించారు. జర్నలిస్టులకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.యూనియన్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సంఘటితం చేయడం, వారి హక్కులు, సంక్షేమం కోసం అవసరమైన కార్యక్రమాలను రూపొందించడం వంటి అంశాలను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వివరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమితి చేపట్టనున్న కార్యక్రమాల గురించి తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివరామయ్య చారి, రాష్ట్ర కార్యదర్శి విజయ్, జాయింట్ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి జయకర్, యాగంటి, రంగన్న గౌడ్, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు జెర్మియా, కార్యదర్శులు సుధాకర్, గిరి, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, వలసల సుధాకర్, తోపురెడ్డి కృష్ణారెడ్డి, వలసల రంగస్వామి, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మెన్ రేసులో కృష్ణ మోహన్ ?

**ఆ కుటుంబం నుంచి అయిదు సార్లు మున్సిపల్ విజేతలు.**
**అధికార పార్టీలో ఉండి ప్రశ్నించే ఒకే ఒక నాయకుడు.**
**అభివృద్ధిపై కౌన్సిల్ లో గళమెత్తే నాయకుడు కృష్ణ మోహన్.**
**అవకాశం ఇస్తే గెలిచి చూపిస్తా.**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 12 ( నంది పత్రిక )** రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికలు రోజుకో అభ్యర్థి చైర్మెన్ గా పోటీ బరిలో ఉన్నట్టు ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ లు ప్రకటించకముందే ఆశావహులు ఒకరొకరు బయటకు వస్తున్నారు.రాజకీయ అనుభవం, పలుకుబడి,డబ్బు ఉన్నవారు ఎందరో ఈ ఎన్నికల్లో తమ సత్తా చాటుకునేందుకు సోషల్ మీడియా వేదికగా బయటపడుతున్నారు.రిజర్వేషన్ లో బీసీ కి వస్తుందనే ఊహాగానాలతో అభ్యర్థులు తమ మనసులో మాట వెల్లబుచ్చుతున్నారు.ఈ నేపథ్యంలోనే అయిదు సార్లు ఆ కుటుంబం నుంచి మున్సిపల్ కౌన్సిలర్లుగా హ్యాట్రిక్ సాధించిన వారిలో ఒకరైన కృష్ణ మోహన్ మున్సిపల్ చైర్మెన్ బరిలో ఉన్నట్టు సమాచారం.రాజకీయాల్లో మూడున్నర శతాబ్దాలుగా నూనె పల్లె ప్రాంతంలో వారి పై మహా మహులు పోటీలో నిలబడి శాయశక్తులు ఉపయోగించిన ఆ కుటుంబం పై ఆ ప్రాంత ప్రజలు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయకుండా ఆ కుటుంబం నుంచి ఎవరు పోటీ చేసినా తప్పక విజయం సాధిస్తూ వచ్చేవారు.ప్రజల ఆశలు వమ్మించేయకుండా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం సొంత పార్టీలో ఉన్నా పదవి కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యమని భావించి కౌన్సిల్ లో గళం ఎత్తి ఆశించుకునేవారు.ఆ కుటుంబంలో కృష్ణ మోహన్ సోదరుడు చంద్ర మోహన్ కాంగ్రెస్ పార్టీ తరుపున 1987 లో పోటీ చేసి మొట్ట మొదటిసారి కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు.వీరి మరదలు అరుణ కుమారి 2000 సంవత్సరంలో టీడీపీ తరుపున పోటీ చేసి కౌన్సిలర్ గా గెలుపొందారు. 2005 లో కృష్ణ మోహన్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి కౌన్సిలర్ గా గెలుపొందారు.ఆ తర్వాత 2014 లో కృష్ణ మోహన్ సతీమణి వెంకటలక్ష్మి టీడీపీ తరుపున పోటీ చేసి గెలుపొందారు.ఆ తర్వాత రాజకీయాల్లో పెను మార్పులు సంభవించి శిల్పా కుటుంబం వైసిపి లో చేరడంతో ఆ కుటుంబానికి వీరాభిమాని కావడంతో శిల్పా కుటుంబం కాంగ్రెస్,టీడీపీ,వైసిపి పార్టీలో చేరినప్పుడల్లా ఉడతా భక్తిగా శిల్పా కుటుంబం ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో చేరేవారు.ఆ తర్వాత జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కృష్ణ మోహన్ ప్రత్యర్థి ధన బలం ఉండడంతో ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా తిరిగి కృష్ణ మోహన్ కి విజయం వరించింది.నంద్యాల కౌన్సిల్ లో ఆనాడు అయినా,ఈ నాడు అయినా సమస్యలపై సంకోచం లేకుండా ప్రశ్నించే కౌన్సిలర్ అంటే కృష్ణ మోహన్ ఒక్కరే అని అందరికీ తెలిసిన విషయమే.మూడు పర్యాయాలు శిల్పా వర్గం కు చెందిన చైర్మెన్ లు ఉన్న కూడా వార్డ్ అభివృద్ధి,అధికారుల నిర్లక్షం పై వేలు ఎత్తి చూపే నాయకుడు . బిసి వర్గానికి చెందిన వారు కావడంతో రిజర్వేషన్ బిసి కి కేటాయిస్తే అధిష్టానం అవకాశం కల్పిస్తే అధిష్టానం కు చెడ్డ పేరు తీసుకొని రాకుండా గెలిచి చూపిస్తాడని బంధువులు,స్నేహితులు పేర్కొనడం విశేషం.రాజకీయాల్లో డబ్బు ప్రదానం కాదని ప్రశ్నించే తత్వం,సమస్య కోసం వచ్చే ప్రజలకు సమస్యలు పరిష్కరించే నాయకుడిని చూస్తారు కానీ డబ్బు చూడరని తెలుస్తోంది.నంద్యాలలో 30 ఏళ్ల రాజకీయాల్లో మొదట్లో ఓటర్లు డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వలేదు,మంచి వ్యక్తి ,అభివృద్ధి చేసే వారిని ఆశీర్వాదం ఇచ్చేవారు.నంద్యాల అంటేనే దేశంలో రాజకీయంగా పేరు తీసుకొచ్చారు.నంద్యాల ప్రజలాసిర్వడం ఎలా ఉంటుందంటే రాష్ట్రపతి,ప్రార్థన మంత్రి,మంత్రులు,ఎంపీ, ఎమ్మెల్యే ల కు రాజకీయ పునర్జన్మ ప్రసాదించిన నవనందుల గడ్డ.నంద్యాల ప్రజలు అనుకుంటే సాధించనిది ఏమి లేదని అందరికీ తెలుసు.రాజకీయంగా అని పార్టీలు చూశారు,అందరూ నేతలను చూశారు,సామాన్య కార్య కర్తలు సైతం అందలం ఎక్కించిన ఘనత నంద్యాల ఓటర్లకే సాధ్యం.నంద్యాల ఓటర్లు మనసులో అనుకుంటే అదృష్టం బాగుంది,అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి చైర్మెన్ అభ్యర్థిగా కృష్ణ మోహన్ కు అవకాశం కల్పిస్తే నంద్యాల ఓటరు దేవుళ్ళ ఈయన పై కూడా కనుకరిస్తే మరో చరిత్ర సృష్టిస్తారు అనేది వాస్తవం.అధిష్టానం అండదండలు,ప్రజల ఆశీర్వాదం లభిస్తే కృష్ణ మోహన్ కు అదృష్టం వరిస్తుందని ఆశిద్దాం.



# డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి బేతంచెర్లకు రాక .



**బేతంచెర్ల అక్టోబర్ 12 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణం నందుగల జిఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఉదయం 10 గంటలకు, బేతంచెర్ల టౌన్ కు సంబంధించిన క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్చార్జిలతో, కూటమి నాయకులతో కార్యకర్తలతో, స్థానిక సంస్థల ఎన్నికల గురించి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి చర్చించనున్నారు కావున, కూటమి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జీలు, మంగళవారం ( నేడే )ఉదయం 10 గంటలకు జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ దగ్గరికి రావాల్సిందిగా కోరుతూతెలుగుదేశం పార్టీ కార్యాలయం బేతంచెర్ల వారు తెలిపారు.

# ఆర్ కొత్తూరులో గోకులం షెడ్డు ప్రారంభం




**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 12 (నంది పత్రిక):** మండలంలోని ఆర్ కొత్తూరు గ్రామంలో వి బి జి రామ్ జి పథకం కింద నిర్మించిన గోకులం షెడ్డు ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కొండ మాయ పల్లె పంచాయతీలోని ఆర్ కొత్తూరు గ్రామానికి చెందిన పాడిరైతు బాలరాజు రూ. 2 లక్షల వ్యయంతో ఈ షెడ్డును నిర్మించారు. ముందుగా పూజారి శ్రీనివాసులు సాంప్రదాయంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, మండలస్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, ఏపీవో గౌరీ భాయ్, ఈసీ సుబ్బన్న, టిడిపి నాయకులు అల్లాడి చంద్రశేఖర్ పాల్గొని ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఆర్ కొత్తూరు గ్రామంలో పాడి రైతు బాలరాజు వి బి జి రామ్ జి పథకం ద్వారా రూ.2లక్షల నిధులతో నిర్మించిన గోకులం షెడ్డు ను నేడు ప్రారంభోత్స వం చేశామన్నారు. అనంతరంమండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ, రుద్రవరం మండలం లో పాడి రైతులకు దాదాపు 40 గోకులం షెడ్లను మంజూరు చేసామని, అందులో ఆర్ కొత్తూరు రైతు బాలరాజు గోకులం నిర్మాణం పనులుత్వరగా పూర్తి చేశారని అభినందించారు. ఈ పథకం కింద రూ. 1.80 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని రైతు వాటా పది శాతం అంటే20 వేలు వెచ్చించాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిందూ స్మశానవాటికలో వీధి లైట్ల ఏర్పాటుకు దాతల సహకారం



### సమస్యను తెలుసుకుని వెంటనే స్పందించిన మేకల శ్రీనివాసులు, నారాయణమూర్తి

**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 12** డోన్ పట్టణంలోని హిందూ స్మశానవాటికలో వీధి లైట్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్మశానవాటికలో గుంతలు తవ్వే కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దాతల సహకారం అందించాలని కోరుతూ మూడు రోజుల క్రితం సేవా సమితి ప్రతినిధులకు ఫోన్ చేసి తమ సమస్యను వివరించారు. స్మశానవాటికలో వీధి లైట్లు పనిచేయకపోవడం వల్ల రాత్రి వేళల్లో చీకటి నెలకొని ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన సేవా సమితి ప్రతినిధులు వెంటనే స్పందించారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే వారి సహకారంతో వీధి లైట్ల సమస్యను పరిష్కరించవచ్చని భావించి పలువురు దాతలను సంప్రదించి పరిస్థితిని వివరించారు. సేవా సమితి ప్రతినిధులు వివరించిన సమస్యపై డోన్ పట్టణానికి చెందిన మేకల శ్రీనివాసులు, కొండపేటకు చెందిన నారాయణమూర్తి సానుకూలంగా స్పందించారు. వీధి లైట్ల ఏర్పాటుకు అవసరమైన ఖర్చును వెంటనే ఫోన్‌పే ద్వారా పంపించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనికి తక్షణమే ఆర్థిక సహాయం అందించడం పట్ల స్మశానవాటికలో గుంతలు తవ్వే కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి స్మశానవాటికలో వీధి లైట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన మేకల శ్రీనివాసులు, నారాయణమూర్తికి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమస్యలను గుర్తించి దాతలు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

# రంజీ ట్రోఫీకి అన్యాయం.. బీసీసీఐ షెడ్యూలింగ్‌పై గవాస్కర్ అసంతృప్తి

భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు. రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తుచేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. "రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడం వల్ల దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన కొందరు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# గుడిసెలు కోల్పోయిన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి






### ఎమ్మెల్యే, ఆర్డీవో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి: సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్

**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 12** పట్టణంలోని 503 సర్వే నంబర్‌లో గుడిసెలు కూల్చివేతతో నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని, అర్హులైన బాధితులకు గతంలో గుడిసెలు వేసుకున్న స్థలంలోనే ఇంటి పట్టాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే, ఆర్డీవో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు కోల్పోయిన బాధితులు డోన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కీ శ్రీకాంత్‌తో పాటు సీపీఎం మండల కార్యదర్శి రామాంజనేయులు, ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కీ హరి మాట్లాడుతూ.. సుమారు ఏడాదిన్నర క్రితం పట్టణంలోని 503 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు తెల్లవారుజామున జేసీబీలతో కూల్చివేశారని తెలిపారు. దీంతో అనేక పేద కుటుంబాలు నివాసం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బాధితులకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టిన సమయంలో అర్హులైన వారికి అదే స్థలంలో ఇంటి పట్టాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే, ఆర్డీవో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పట్టణంలో అనేకమంది నిరుపేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఒకవైపు నిరుపేదలకు ఇంటి పట్టాలు అందడంలో జాప్యం జరుగుతుండగా, మరోవైపు ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు ఇళ్లు లేని పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పట్టణంలోని 503 సర్వే నంబర్‌లో ఉన్న సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిలో శ్రీరామనగర్, వైఎస్సార్ నగర్, కొండపేట, చిగురుమానిపేట, పాతపేట కాలనీలకు చెందిన సుమారు 100 పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివసించాయని తెలిపారు. వారి గుడిసెలు కూల్చివేసిన నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి, నిజమైన అర్హులను గుర్తించాలని డిమాండ్ చేశారు. అర్హులైన బాధితులకు గతంలో వారు నివసించిన స్థలంలోనే ఇంటి పట్టాలు పంపిణీ చేసి, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. గుడిసెలు కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే, ఆర్డీవో గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని తక్షణమే న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితుల సమస్యను పరిష్కరించకపోతే వారితో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీగా మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సిరినా, షాబానా, వరలక్ష్మి, లీలావతి బీబీ, భూలక్ష్మి, సూర్యపద్మమ్మ, మాధవితో పాటు పలువురు గుడిసెలు కోల్పోయిన బాధితులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ప్రధమ చికిత్స నేర్చుకోవాలి

### -రెడ్ క్రాస్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ శిబిరం



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుండి 8 రోజులపాటు మిడుతూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ హైస్కూల్ నందు సీనియర్ ప్రొఫెషనల్ ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి చెందిన రెడ్ క్రాస్ నేషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స సీపీఆర్ పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ ప్రాంతాలలో తేలుకాటు పాముకాటుకు గురైనప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వీడియోల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మిడుతూరు రెడ్ క్రాస్ ప్రతినిధులు ఏం ఏం భాష మూల గోపాల్ మల్లయ్య నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ డిఎఫ్ఓ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికి సిపిఆర్, ఫస్ట్ ఎయిడ్ నేర్పించాలనే గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మారుమూల ప్రాంతాలలో కూడా సిపిఆర్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ మరియు నంద్యాల రెడ్ క్రాస్ ట్రెజరర్ ప్రముఖ స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ అరుణకుమారి వివిధ అంశాలవారీగా శిక్షణ ఇస్తారని తెలిపారు.

## రంగసముద్రం పంచాయతీలో కోటి రూపాయలతో రోడ్ల నిర్మాణం!

### అభివృద్ధి పనులకు శ్రీకారం.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు

**పోరుమామిళ్ల అక్టోబర్ 12 (నంది పత్రిక ):** బద్వేల్ నియోజక వర్గం ఇంచార్జి మంచూరి సూర్యనారాయణ రెడ్డి మరియు బద్వేల్ యువ నాయకులు చెరుకూరి రవి కుమార్ చొరవతో పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కోటి రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. కమ్మవారిపల్లె, మహబూబ్‌నగర్‌లో ఎస్ ఆర్ స్టీల్స్ ఎదురుగా, బజాజ్ షోరూమ్ ఎదురుగా, శ్రీరామ్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కోటి రూపాయల నిధులతో చేపడుతున్న ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయి. పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న ఈ పనులు స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో , ఎక్స మార్కెట్ యార్డు చైర్మెన్ చెరుకూరి చెంద్రయుడు,మాజీ మండలపార్టీటీ అధ్యక్షులు సంజీవ్ చిన్న వెంకట సుబ్బయ్య ,చెరుకూరి చంద్రశేఖర్ ,గుఌం పుల్లపనాయుడు,ఎక్స .ఎంపీటీసీ కలవకూరి రమణయ్య ,నరసయ్య ,రమేష్,కేశవ,పొద రమణయ్య,రామయ్య ,మహేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ వర్క్‌షాప్




**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):** శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్), నంద్యాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 11నుంచి 13 వరకు ఏఐ ఎక్స్ప్లోర్: ఏ హాండ్స్ ఆన్ జర్నీ ఇంటో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే అంశంపై మూడు రోజుల సాంకేతిక వర్క్‌షాప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తిగా ఇండియన్ సర్వర్స్ వ్యవస్థాపకులు, సీఈఓ సాయి సతీష్ పాల్గొని విద్యార్థులకు కృత్రిమ మేధస్సు సాంకేతికతలు, వాటి వినియోగాలు, ఆధునిక ఏఐ టూల్స్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా ఏఐ సాంకేతికతలను నేర్చుకునేలా ఈ వర్క్‌షాప్‌ను రూపొందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రమణ్యం మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విభాగాధిపతి డా. జె. డేవిడ్ సుకీర్తి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా జి. నాగ పవని వ్యవహరించారు. ఈ వర్క్‌షాప్ స్టూడెంట్ బ్రాంచ్ మరియు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో నిర్వహించబడింది. విద్యార్థుల్లో నాణ్యమైన విద్య, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాలు మరియు బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టు చీరలు విరాళం



**మహానంది అక్టోబర్ 12 ( నంది పత్రిక ):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ అంకాల పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తోటం శెట్టి లోకేష్ కుమార్ అమ్మవారికి 9 పట్టు చీరలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఉల్లి మధు, చిన్న కాశయ్య దాతలను అభినందించారు. ఈ పట్టు చీరలను నవరాత్రి ఉత్సవాలలో రోజుకోకటి చొప్పున అమ్మవారికి అలంకరించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

## బుక్కాపురంలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**మహానంది అక్టోబర్ 12 (నంది పత్రిక):-** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బుక్కాపురం గ్రామంలో స్వర్ణ సచివాలయం, శివాలయం దగ్గర ఏర్పాటు చేసిన మండపాల వద్ద దుర్గాదేవి కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా స్వర్ణ సచివాలయం వద్ద రెండవ రోజు అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఓంకారంలో అటవీశాఖ డిడి పూజలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 12:** దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నంద్యాల ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రంలో ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రులు జరుగుతున్న సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం ఓంకార పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. పుణ్యక్షేత్రంలో గాయత్రి అమ్మవారి అలంకారం, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. నవగ్రహ మండపరాధన మహా మంగళ హారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి దంపతులకు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పకృతి, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నాగ ప్రసాద్, దేవస్థానం చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులతోపాటు, అర్చకులు భాస్కర శర్మ సురేష్ శర్మ దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

**బండి ఆత్మకూరులో** బండి ఆత్మకూరులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య భక్తులు గుండా పుల్లయ్య, నాగేంద్ర ,వంకధార నాగేంద్రబాబు కుటుంబీకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారిని గాయత్రి దేవి రూపంలో అలంకరించారు.



## కరువు ప్రాంత రైతులు, కౌలు రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలి

### విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు తక్షణమే అందించాలి
### కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, ముందస్తు కౌలు నగదును తిరిగి చెల్లించాలి
### వలసల నివారణకు ఉపాధి హామీ పనులు చేపట్టాలి: చాంద్ బాషా డిమాండ్

**వెలుగోడు (అక్టోబర్ 12) నంది పత్రిక:** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న కరువు ప్రాంత రైతులు, కౌలు రైతుల రుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే మాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం వెలుగోడు మండల అధ్యక్షుడు షేక్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం వెలుగోడు గ్రామంలో నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా షేక్ చాంద్ బాషా మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగ, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని తీవ్రంగా విమర్శించారు. వాతావరణ నిపుణులు ఎల్ నినో వల్ల తీవ్ర కరువు ఏర్పడుతుందని ముందే హెచ్చరించినా, ప్రభుత్వాలు ముందుచూపుతో వ్యవహరించకపోవడం వల్లే నేడు ఈ దుస్థితి దాపురించిందని మండిపడ్డారు.

**ఎండిపోతున్న పంటలు అప్పుల ఊబిలో రైతులు:**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం వల్ల లక్షలాది ఎకరాల్లో పంటలు సాగుకు దూరమయ్యాయని, వేసిన పంటలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటి 50 శాతానికి పైగా వ్యవసాయ బోర్లు పనిచేయడం లేదని, చివరికి ట్యాంకర్లతో నీటిని తెచ్చి ప్రత్తి, మిర్చి పంటలను కాపాడుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏపీలో ప్రభుత్వం 388 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించిందని, కానీ వాస్తవానికి రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో 500కు పైగా మండలాలు కరువు బారిన పడ్డాయని తెలిపారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పశు గ్రాసం కొరత తీవ్రమైందని.. పనులు లేక గ్రామాల నుంచి వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**కౌలు రైతుల దయనీయ స్థితి:**

దేవాదాయ, ధర్మాదాయ భూములతో సహా ఇతర భూములకు ముందస్తు కౌలు చెల్లించిన కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని పేర్కొన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో కౌలు రైతులకు పంట రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ, ఎరువులు, పంటల కొనుగోలు ప్రయోజనాలతో పాటు నష్టపరిహారం కూడా దక్కడం లేదని ఆరోపించారు.

**ప్రభుత్వానికి ముఖ్య డిమాండ్లు:**

రుణమాఫీ: కరువు ప్రాంత రైతులు, కౌలు రైతుల రుణాలను యుద్ధప్రాతిపదికన మాఫీ చేయాలి.

కౌలు నగదు వాపస్: కౌలు రైతులు చెల్లించిన 2026-27 సంవత్సరపు కౌలును తిరిగి చెల్లించాలి, లేదా దానిని 2027-28 సంవత్సరపు కౌలుగా జమ చేయాలి. గుర్తింపు కార్డులు: కౌలు రైతులందరికీ వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఉపాధి పనులు & తాగునీరు: వలసల నివారణకు ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించాలి. ప్రజలకు తాగునీరు, పశువులకు గ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు రమణ, ముబారక్, అబ్దుల్, రెడ్డి, కిరణ్, హరి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా భిక్షాటనను అవమానంగా కాదు ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి హెచ్చరికగా చూడాలి!

### అర్.ఏ.అర్.ఎస్ పరిరక్షణ, నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 12 ( నంది పత్రిక )** నంద్యాల అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో "ప్రజల ఆస్తులు ప్రజలకే చెందాలి" అనే నినాదంతో గత నాలుగు నెలలుగా ప్రజా ఉద్యమం కొనసాగుతోంది. 125 ఏళ్ల చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయించిన రెండెకరాల భూమి లీజును రద్దు చేయాలని ఐక్యవేదిక ప్రధానంగా ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం, ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రభుత్వానికి ఉత్తరాలు రాయడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో కలెక్టర్‌కు పిటిషన్లు సమర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన స్పందన రాలేదు. దీంతో ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి పెంచేందుకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 9న నంద్యాల గాంధీ చౌక్‌లో ప్రజా భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేకరించిన మొత్తాన్ని అక్టోబర్ 11న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు అందజేసి, ప్రజా ఆస్తుల పరిరక్షణపై ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని అఖిలపక్ష నాయకులు ప్రయత్నించారు.

**అర్.ఏ.అర్.ఎస్. పరిరక్షణపై కలెక్టర్‌తో చర్చ**

ప్రజా భిక్షాటన ద్వారా సేకరించిన మొత్తాన్ని స్వీకరించే సందర్భంలో, కలెక్టరేట్ కార్యాలయాన్ని ఖాళీ చేసి ఎండలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించాలా? అని కలెక్టర్ అఖిలపక్ష నాయకులను ప్రశ్నించినట్లు నాయకులు తెలిపారు. దీనికి స్పందిస్తూ, రాయలసీమ సాగునీటి సాధన సమితి, ఇతర రైతు సంఘాలు, నాయకులు గత ఐదేళ్లుగా అర్.ఏ.అర్.ఎస్. పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేస్తున్న విషయాన్ని కలెక్టర్ గారికి వివరించారు. న్యాయస్థానం అనుమతి తాత్కాలిక కలెక్టరేట్ అవసరాల కోసం కొన్ని గదుల వినియోగానికే పరిమితమైందని వారు పేర్కొన్నారు. 2014 ఆగస్టు 15న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లాను జాతీయ విత్తన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 125 ఏళ్ల చరిత్ర కలిగిన అర్.ఏ.అర్.ఎస్.ను మరింత అభివృద్ధి చేయాల్సిన సమయంలో, అక్కడి భవనాలు, భూములు ఇతర పరిపాలనా అవసరాలకు వినియోగించడం ఆ హామీ లక్ష్యానికి అనుగుణంగా ఉందా అని ప్రశ్నించారు. ఈ అంశాలన్నీ తనకు తెలుసునని, అఖిలపక్ష ఐక్యవేదిక సమర్పించిన పిటిషన్‌ను ఉన్నతాధికారులకు పంపిస్తానని కలెక్టర్ తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. మార్కెట్ యార్డులు రైతుల కోసమా? పార్టీ కార్యాలయాల కోసమా? రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, గోదాములు నిర్మించడం, ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులపై రుణ సదుపాయాలు కల్పించడం వంటి చర్యల ప్రాధాన్యతను అఖిలపక్ష నాయకులు వివరించారు. మార్కెట్ యార్డుల్లో రైతులకు విశ్రాంతి గదులు, క్యాంటీన్లు, నిల్వ సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా, వాటిని అభివృద్ధి చేయకుండా నూనెపల్లె మార్కెట్ యార్డులో రెండెకరాల భూమిని రాజకీయ పార్టీ కార్యాలయానికి 33 ఏళ్లకు లీజుకు ఇవ్వడం సమంజసం కాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేటాయింపును రద్దు చేసి, మార్కెట్ యార్డు భూములను రైతుల ఆదాయం, వ్యవసాయ మార్కెటింగ్ అభివృద్ధికి ఉపయోగించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజా భిక్షాటన ప్రజలను అవమానించ డానికి కాదు.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడానికి! ప్రజా భిక్షాటన ద్వారా సేకరించిన మొత్తాన్ని స్వీకరించడానికి కలెక్టర్ అంగీకరించలేదని, ఈ కార్యక్రమం ప్రభుత్వం, ప్రజలను అవమానపరిచినట్లుగా ఉందని కలెక్టర్ వ్యాఖ్యానించినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. దీనిపై స్పందించిన నాయకులు, ప్రజా సమస్యలను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ప్రజల ఆకాంక్షలను తెలియజేయడానికి ఈ ప్రతీకాత్మక కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. ప్రభుత్వం, ప్రజలను అవమానించడం తమ ఉద్దేశం కాదని, ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వ విధానాలపై నిరసన తెలియజేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తన విధానాలను సరిదిద్దుకోవాలని కోరుతూ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలను అవమానించిన చర్యగా చూడకూడదని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ఎత్తిచూపడం ప్రజాస్వామ్యంలో ప్రజా సంఘాల బాధ్యత అని, ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన విజిల్‌బ్లోయర్ తరహా ప్రయత్నంగా చూడాలని నాయకులు కోరారు.

**రెండు సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ హామీ**

అర్.ఏ.అర్.ఎస్ .నుంచి తాత్కాలిక కలెక్టరేట్ తరలింపు, నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు అనే రెండు అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ రెండు సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని అఖిలపక్ష ఐక్యవేదిక స్పష్టం చేసింది.

**ప్రజా ఆస్తులు ప్రజలకే చెందాలి..**
**రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యం కావాలి!**

ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, క్రిష్టియన్జీ. జె.ఏ.సి నాయకులు జానయ్య, సి.పై. ఐ నాయకులు చౌడప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహనరావు, ఎస్.డి. పి . ఐ నాయకులు ఏజెస్ హుస్సేన్, మజీద్ ఖాన్, వాల్మీకి పోరాట సమితి అధ్యక్షుడు బోయ పులి కొండన్న,ప్రొఫెసర్ శివరామిరెడ్డి, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు షణ్ముఖరావు, సి.పి. ఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, సోమన్న, పిడిఎఫ్ యు నాయకులు రాఅంబాబు సమితి కార్యవర్గ సభ్యులు యర్రం శంకర్ రెడ్డి, చిన్న రామకృష్ణారెడ్డి, పట్నం రాముడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వం భూములన్నీ పెద్దలకేనా అధికారం.

### రాజకీయ పోలం ఉంటే ఎన్ని ఎకరాలైనా ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవచ్చ

### భూమిలేని అర్హులైన పేదలకు కనీసం ఎకరం భూమి అయిన ఇవ్వరా

### ప్రభుత్వ భూములన్నీ పెద్దల చేతుల్లోనే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన భూమిలేని పేదలకు పంచాలి.

### శిరివెళ్లలో ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు భూమిని పొంచాలి: సిపిఐ డిమాండ్.



**సిరివెళ్ల (నంది పత్రిక)** శిరివెళ్ల గ్రామ పొలిమేరలోని ప్రభుత్వ అసైన్ మెంట్ భూములను.అక్రమార్కుల నుంచి రెవెన్యూ శాఖ వెంటనే స్వాధీనం చేసుకొని.అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని (సిపిఐ) పార్టీ ఇసుకపల్లె గ్రామ శాఖ కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గౌరవనీయులైన తహసీల్దార్ గారికి విలేకరుల సమక్షంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నాయకులు మాట్లాడుతూ...శిరివెళ్ల గ్రామ పొలిమేరలోని ప్రభుత్వ అసైన్ మెంట్ సర్వేనెంబర్ 1022 లో అక్రమంగా ఆన్లైన్ అయిన భూముల వ్యవహారంలో తహసీల్దార్ ఐ.విజయశ్రీ మేడం గారు గతంలో చర్యలు తీసుకున్నారని తెలిపారు.సదరు సర్వేనెంబర్ పరిధిలో ఖాతా నెంబర్లు 8238 మరియు 8239 గా మంజూరైన పట్టాదార్ పాస్ పుస్తకాలను.తహసీల్దార్ ఆన్లైన్ నుండి తొలగించడం జరిగింది అన్నారు. అయితే ప్రభుత్వ రికార్డుల నుండి తొలిగించినప్పటికి సదరు ప్రభుత్వ భూమిని రెవెన్యూ శాఖ ఇప్పటివరకు తమ ఆదీన.స్వాధీనంలోకి తీసుకోకపోవడం శోచనీయమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆన్లైన్లో హక్కులు లేని సదరు వ్యక్తులే ఇప్పటికీ ఆ భూమిలో పంటలు పండిస్తూ.సాగులో కొనసాగుతున్నారని వారు విలేకరులకు వివరించారు.

**సిపిఐ పార్టీ ప్రధాన డిమాండ్లు:** ఆన్లైన్ నుండి పేర్లను తొలగించిన సర్వేనెంబర్ 1022 లోని ప్రభుత్వ భూమిని తహసీల్దార్ వెంటనే స్పందించి చట్ట ప్రకారం రెవెన్యూ శాఖ పరంగా స్వాధీనం చేసుకోవాలి.సదరు సర్వేనెంబర్ లో మిగులుగా ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమిని.అక్రమ సాగుదారుల నుండి స్వాధీనం చేసుకున్న భూమిని కలిపి ఇసుకపల్లె గ్రామంలోని అసలైన నిరుపేద కుటుంబాలకు సాగు నిమిత్తం కేటాయించాలి.అర్హులైన పేదలకు ఆన్లైన్ పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేసి వారు కుటుంబంతో సంతోషంగా జీవించడానికి చట్టబద్ధంగా చట్టప్రకారమైన హక్కులను కల్పించాలి.ప్రభుత్వ భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై తూతుమంత్రం చర్యలు సరిపోవని భూమిని నిరుపేదలకు పంచెంతవరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూక సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి కే.భాస్కర్ మరియు శిరివెళ్ల మండల రైతు సంఘం కార్యదర్శి డి.మౌలాలి ఇసుకపల్లె గ్రామ శాఖ కార్యదర్శి జి.మధు శాఖ సహాయ కార్యదర్శి కే.పాములేటి మరియు నిరుపేదలైన లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

### పీజీఆర్ఎస్‌కు 276 దరఖాస్తులు..

### రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12(నంది పత్రిక):–** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి 276 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులు నిర్దేశిత గడువు దాటకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా పునఃప్రారంభించిన (రీ–ఓపెన్) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల మూలాలను గుర్తించి, నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ** భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లను సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా అర్జీదారులకు సత్వర న్యాయం అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 అర్జీలు స్వీకరించగా, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 58, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించి 35, సర్వే, రీ–సర్వేలకు సంబంధించి 15, చుక్కల భూములు, 22–ఎ భూములు, క్రమబద్ధీకరణకు సంబంధించి 14, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 14, అడంగల్ సవరణలకు సంబంధించి 8, రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 4 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలు**

నంద్యాల పట్టణంలోని పొన్నాపురం కాలనీ 80 అడుగుల రహదారిలో సిమెంట్ రోడ్డు, మున్సిపల్ పైప్‌లైన్ సౌకర్యాలు కల్పించాలని, ఆత్మకూరు మండలానికి చెందిన టి. శ్రీనివాసరెడ్డి తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని, రుద్రవరం మండలం డి. కొట్టాల గ్రామానికి చెందిన వెంకటరమణకు రెండేళ్లుగా రైతు భరోసా నిధులు జమ కానందున సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రుద్రవరంలో రెండవ రోజు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 12 (నంది పత్రిక):** రుద్రవరం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు అమ్మవారు భక్తులకు 'గాయత్రీ దేవి' అలంకారంలో దర్శనమిచ్చారు. సకల వేదాలకు మూలమైన గాయత్రీ దేవిని పూజిస్తే అజ్ఞానం తొలగిపోయి అపారమైన జ్ఞానం, తేజస్సు, సకల శుభాలు సిద్ధిస్తాయని, త్రిమూర్తుల స్వరూపంగా ఈ మాతను ఆరాధిస్తారని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించగా.. సాయంత్రం తమిళనాడు నుండి వచ్చిన ప్రత్యేక పూజారుల చేత అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి, లలితా సహస్రనామ కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. పూజా అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా, ఈ ఆధ్యాత్మిక వేడుకలో పూజా దాతలతో పాటు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# కలెక్టర్ కు ఏపీడబ్ల్యూ జె యఫ్ వినతి

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక**కర్నూలు జిల్లాలో ఇండ్ల స్థలాలు లేని వారికోసం తన నేతృత్వంలో జేసీ, డీఆర్వో లతో కూడిన కమిటీ ని ఏర్పాటు చేయాలని డిఆర్వో లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జగన్నాథ్ గట్టు జర్నలిస్టుల స్థలాల్లో అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులకు ఆదేశాలు జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీ డబ్ల్యూ జె యఫ్ ) జిల్లా కమిటీ.జిల్లా కలెక్టర్ కు జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏపీ డబ్ల్యూ జేయఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.జి.ప్రసాద్ వివరించారు. జిల్లా కలెక్టర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుడిసె శివన్న జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు యం.శివ శంకర్, ప్రధాన కార్యదర్శి టి.జి.ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శులు జయరాజ్, ఉరుకుంద,నగర కార్యదర్శి ఎర్రమల,మోహన్,శ్రీనాథ్ రెడ్డి లతో కూడిన ప్రతినిధి బృందం సమర్పించింది. జిల్లా అధ్యక్షులు యం. శివ శంకర్ అధ్యక్షత జరిగింది.ఈసందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.జి.ప్రసాద్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వివిధ మీడియా సంస్థలలో పని చేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనివారు విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులు నిరంతరం ప్రభుత్వనికి, ప్రజల మధ్య వారధిగా పనిచేస్తున్న . జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం అర్హులైన ప్రతి జర్నలిస్టుకి ఇంటి స్థలం ఇవ్వాలి. ఇంటి నిర్మాణం కూడా చేపట్టాలని, జర్నలిస్టులకు గతంలో మాదిరిగా రైల్వే పాసులను తిరిగి పునరుద్ధరించాలని. 58 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు కనీసం రూ.10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కర్నూలు నగరం గతంలో కర్నూలు నగరంలో జగన్నాథ గట్టులో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. దాని నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, నిర్బంధాలు, అక్రమ కేసుల నివారణకు చర్యలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు

### అనాథగా మారిన విద్యార్థిని ఉన్నత విద్యకు కలెక్టర్ భరోసా

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12(నంది పత్రిక):–** గత సంవత్సరం చాగలమర్రి మండలం చిన్నగొంగలి గ్రామంలో వర్షాల కారణంగా మట్టిమిద్దె కూలిన ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన ఇంటర్మీడియట్ విద్యార్థిని గురులక్ష్మి ప్రసన్నకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అండగా నిలిచారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో విద్యార్థినితో మాట్లాడి, ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబాన్ని కోల్పోయినప్పటికీ ధైర్యంగా చదువును కొనసాగిస్తూ ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించడంతో పాటు, విద్యార్థిని భవిష్యత్తు కోసం రూ.2 లక్షలను ఆమె అమ్మమ్మకు అందించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదరికం లేదా ప్రతికూల పరిస్థితులు విద్యకు అడ్డంకులు కాకూడదని, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థినికి సూచించారు. ఆమె విద్యాభ్యాసం నిరాటంకంగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# రుద్రవరం మండల నూతన ఎస్సైగా ఎన్ మహమ్మద్ రఫీ బాధ్యతలు.

**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 12 (నంది పత్రిక):** రుద్రవరం మండల నూతన ఎస్సైగా ఎన్ మహమ్మద్ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై జయప్ప బదిలీపై నంద్యాల 1 పట్టణం పోలీస్ స్టేషన్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నంద్యాల హెడ్ క్వార్టర్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎన్ మహమ్మద్ రఫీ ని రుద్రవరం పోలీస్ స్టేషన్ కు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయనబాధ్యతలు స్వీకరించారు.



# ఆడపిల్లలను కాపాడుదాం.. సమాన అవకాశాలు కల్పిద్దాం

**లింగ వివక్షను రూపుమాపుదాం**
**ఆడపిల్లల రక్షణ, లింగ సమానత్వంపై విస్తృత అవగాహన కల్పించాలి**
**అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా లఘుచిత్ర పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12(నంది పత్రిక):- మహిళల ప్రతిభను గుర్తించి, అన్ని రంగాల్లో వారికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాశాలలకు జిల్లా కలెక్టర్ నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆడపిల్లల రక్షణ, మహిళా సాధికారత, లింగ సమానత్వంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు విద్య, వైద్యం, విజ్ఞానం, క్రీడలు, పరిపాలన సహా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యాలను గుర్తించి, వారి అభ్యున్నతికి అవసరమైన అవకాశాలను కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం, గర్భస్థ శిశువు ఆడపిల్ల అని నిర్ధారించుకుని గర్భస్రావానికి పాల్పడటం చట్టవిరుద్ధమని కలెక్టర్ తెలిపారు. ప్రతి శిశువుకు జీవించే హక్కు కల్పించడం, ఆడపిల్లల హక్కులను పరిరక్షించడం, భ్రూణ హత్యలను అరికట్టడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. గర్భస్థ శిశు వు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, లింగ నిర్ధారణ ఆధారంగా గర్భస్రావానికి పాల్పడటం వంటి చర్యలను నిరోధించేందుకు ప్రభుత్వం గర్భధారణ పూర్వ మరియు గర్భధారణ సమయంలో రోగనిర్ధారణ సాంకేతికతల (లింగ ఎంపిక నిషేధ) చట్టం-1994 అమలు చేస్తోందని వివరించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్త్రీల ప్రాధాన్యత, బాలికల రక్షణ, లింగ సమానత్వం, భ్రూణ హత్యల నివారణ వంటి సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి లఘుచిత్రాలు, ఇతర ప్రసార మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న లింగ వివక్షను తొలగించి, బాలికలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, సాధికారత రంగాల్లో సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.




**లఘుచిత్ర పోటీల్లో నంద్యాల జిల్లా కళాశాలల ప్రతిభ**

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల మధ్య నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో ఉత్తమ లఘుచిత్రాలను రూపొందించిన మూడు కళాశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి. ప్రథమ బహుమతి - రూ.30,000: పి.ఎస్.సి. మరియు కె.వి.ఎస్.సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల, ద్వితీయ బహుమతి - రూ.20,000: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ, తృతీయ బహుమతి - రూ.10,000: ఎస్.జి.టి.ఆర్.యం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, బాలికల హక్కులు, రక్షణ, సంక్షేమం, సమానత్వం వంటి అంశాలపై సామాజిక చైతన్యం పెంపొందించడంలో ఇటువంటి పోటీలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. లఘుచిత్రాల ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను, సామాజిక సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి, భవిష్యత్తులోనూ సామాజిక బాధ్యతతో కూడిన సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం టికెట్లు

**పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి టీడీపీ బీసీ నాయకులు**



బనగానపల్లె అక్టోబర్ 12నందిపత్రిక స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం టికెట్లు కేటాయిస్తామన్న పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీసీ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లెలోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని పలువురు బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు కేటాయించాలన్న తెలుగుదేశం పార్టీ నిర్ణయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. బీసీల రాజకీయ సాధికారత, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం పెంపు, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. నియోజకవర్గంలోని బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్ణయించారు.బీసీల అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం పార్టీ టికెట్లు కేటాయిస్తామన్న పార్టీ నిబద్ధతను ప్రజలకు వివరించాలని సమావేశంలో తీర్మానించారు.బీసీల సాధికారత, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి సిపిఐ



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లాలను అన్ని మండ లాలను కరువు మండ లాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో(పీజీఆ ర్యస్ )వినతిపత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు లు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో అర కొరగా కురిసిన వానాలకి రైతులు పంటలు వేయడం జరిగిందని అయితే ఏలినో ప్రభావంతో అత్యంత తక్కువ వర్షపాతం నమోదై రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు అప్పుల పాలయ్యారని అయితే రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీన జిల్లాలో కేవలం 15 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి 12 మండలాలను ప్రకటించకపోవడం బాధాకరమని, ఈ 12 మండలాల్లో కూడా ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదని కావున జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కలెక్టర్ గారిని కోరారు కరువు మండలాలుగా ప్రకటించడమే కాకుండా కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు రైతులు బ్యాంకులో తీసుకున్న అప్పులు 2 లక్షల వరకు మాఫీ చేయాలని, పశుగ్రాసం ఉచితంగా అందించాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి రబ్బీ సీజన్ కి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు కల్పించి వలసలు నివారించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు 15 రకాల నిత్యవసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజా సాహెబ్, రామకృష్ణారెడ్డి,కె శ్రీనివాసులు, నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, సురేష్, బీసన్న, భద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వివాహ మహోత్సవం.

**నూతన వధూవరులను ఆశీర్వదించిన టిడిపి యువనేత భూమా జగత్ విఖ్యాత రెడ్డి**



శిరివెళ్ల (నంది పత్రిక) (నంద్యాల రాజరెడ్డి ఫంక్షన్ హాల్):- శిరివెళ్ల మండల కేంద్రంలోని దివంగత పీఎండి జిలానీ భాష రియాజున్నిస దంపతుల కుమారుడు పీఎండి వసీం అక్రం , శమినాఖాతుం గారి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. నంద్యాల పట్ట ణంలోని రాజారెడ్డి ఏసీ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు బంధుమిత్రులు శ్రేయో భిలాషులు ఆత్మీయులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఫంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది. ఆళ్ళగడ్డ టిడిపి యువ నేత భూమ జగత్ విఖ్యాత రెడ్డి ఇతర నాయకులు ప్రముఖులు దీవెనలు ఆశీర్వచనాలు మంగళ వాయిద్యాలు మూడు ముళ్ళు ఏడడుగులు పంచభూతాల సాక్షిగా జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగింది. ప్రత్యేకమైన రకరకాల వంటకాలతో అతిధులకు శేగు కృష్ణమూర్తి వివా హ భోజనం కల్పించారు. ఈ సందర్భంగా భగవంతుడి చరణాల సాక్షిగా కంటి చూపులతో కలిసిపోయి. మాటల ముచ్చట్లతో మురిసిపోయి. మూడు ముళ్ళతో ముడిపడిపోయి. ఏడడు గులతో ఏకమై. మనసులు మమేకమై. రెండు హృదయాలు ఒక్కట వ్వాలని నూతన జంటను ఆశీర్వదించారు.నూతన వధూవరులు పిల్లాపాపలతో నిండు నూరేళ్లు ఆదర్శ దంపతులుగా జీవించాలని ఆకాంక్షించారు. భూమా జగత్ విఖ్యాత రెడ్డి వెంట న్యాయవాది మర్కస్ మసీదు ప్రెసిడెండెంట్ పీఎండి ఉస్మాన్ సార్,టిడిపి నేతలు బిసి ఫిదా హుస్సేన్,నంద్యాల అబూబకర్ సిద్ధిక్ ఇతర ప్రముఖులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రయాణికులకు సరిపడా ఉచిత సర్వీసు బస్సులను పెంచాలి. సిపిఎం.సి.ఐ.టి. యు.



కర్నూల్ సిటీ నంది పత్రిక సిఐటియు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కోడుమూరు కొత్త బస్టాండ్ నందు సిఐటియు మండల అధ్యక్షులు జిపి వీరన్న అధ్యక్షతన ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని ధర్నా నిర్వహించారు సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గపూర్ మియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన శ్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణికుల పాలిట నరకంగా మారింది పథకం బాగుంది కానీ ప్రయాణికులకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడపడం లేదు రోజు వారి ప్రయాణంలో భాగంగా ప్రయాణం చేయాలంటే కనీసం రెండు లేదా మూడు గంటల పాటు నిరీక్షించాల్సి వస్తున్నది అందువల్ల పనులు జరగడం లేదు అది కూడా గంటల తరబడి నిలబడిన అన్ని బస్సులు ఫుల్లుగా వస్తున్నాయి అందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం సర్వీసులు తగ్గించడం.పండుగలు సెలవులు పెళ్ళిల్ల సీజన్లో అయితే ప్రయాణం చేసి గమ్య స్థానాలకు చేరుతామో లేదో అనే భయం ప్రజల్లో ఉంది ఇక రాష్ట్రంలో ఒక జిల్లా నుండి ఇంకో జిల్లాకి వెళ్లాలంటే ఒక రోజు ముందే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది. అవసరాల రీత్యా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది పెళ్లిళ్లు పండుగలు సీజన్లోనే కాకుండా రోజువారి ప్రయాణంలో పిల్లలు వృద్ధులతో ప్రయాణం చేయాలంటే చాలామంది భయపడుతున్నారు రహదారి వెంట గ్రామాలలో కొన్ని స్టేజీల దగ్గర బస్సులు ఆపడం లేదు కొన్ని చోట్ల బస్సు స్టేజ్ కాదని కిలోమీటర్ దూరంలో ఆపు తున్నారు ఇది అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది కోడుమూరులో పాత బస్టాండ్ నందు2 స్టాప్ 3 స్టాప్ గాని ఆపడం లేదు. ఆపిన అర కిలోమీటర్ దూరంలో ఆపుతున్నారు ఈ విషయం చాలా సార్లు కోడుమూరులో ఉన్న కంట్రోలర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులను నడవాలని ఆలోచిస్తున్నది అది కూడా ప్రైవేటు వారికి అప్పజెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వమే నడపాలి ఆ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణాలు కొనసాగించాలని ఆయన అన్నారు కావున రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం దసరా పండుగ సెలవులు అనే కోణంలో కాకుండా రోజు వారి ప్రయాణికుల కొరకు అదనపు సర్వీసులను పెంచి ప్రయాణికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు అనంతరం వినతి పత్రం కోడుమూరు కంట్రోలర్ కి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో నక్క గిడ్డయ్య కొత్తూరు మల్లికార్జున కర్రె శంకర్ వెంకటస్వామి పులకుర్తి రంగస్వామి బస్టాండ్ నందలి ప్రయాణికులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉంది : మైకేల్

**డోన్ అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ టీం సభ్యుడిగా మైకేల్ బాధ్యతలు**



డోన్, అక్టోబర్ 12 (నంది పత్రిక): జనసేన పార్టీ తరఫున డోన్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్‌కు రాజేష్ (మైకేల్) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జనసేన పార్టీ తరఫున ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీలో ఆలా మోహన్ రెడ్డికి అసెంబ్లీ సమన్వయకర్తగా, చల్ల మద్దిలేటికి ఎన్నికల సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, డోన్ అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో నిర్వహణ బృందం సభ్యుడిగా రాజేష్ (మైకేల్)కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రాజేష్ (మైకేల్) మాట్లాడుతూ, జనసేన పార్టీ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకత్వం తనకు కల్పించిన ఈ అవకాశాన్ని గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి, ప్రజలకు మరింత చేరువ కావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డోన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.అలాగే, నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాల వారీగా పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకొని, వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి కార్యకర్తకు అవసరమైన సహకారం అందిస్తూ, పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని మైకేల్ పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను ఒక అవకాశంగా మాత్రమే కాకుండా, ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌కు మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## బైక్ దొంగల ముఠా గుట్టురట్టు-

**ఆరుగురు పట్టివేత.. 10 బైక్‌లు స్వాధీనం--**

నంద్యాల క్రైం, అక్టోబర్ 12(నంది పత్రిక):- నంద్యాల జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గోస్పాడు పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా, ఒక బాల నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6 లక్షల విలువైన 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి తెల్లపూరి గ్రామ సమీపంలోని కుందూ నది వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. రాత్రివేళల్లో ఇళ్ల ముందు, షెడ్లలో నిలిపిన మోటార్ సైకిళ్లను మారుతాళాలతో తెరిచి దొంగిలించి, నంబరు పలకలు తొలగించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది.నిందితుల్లో కొందరిపై గతంలోనూ దొంగతనం కేసులు నమోదయ్యాయి. అరెస్టు చేసిన ఐదుగురిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. బాల నేరస్తుడి వివరాలను చట్ట ప్రకారం గోప్యంగా ఉంచారు. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పనిచేసిన గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ 2813, పోలీసు కానిస్టేబుళ్లు 1337, 3224, 3256, హోంగార్డు 310లను ఉన్నతాధికారులు అభినందించారు.



వాహనదారులు అదనపు తాళాలు వేసుకుని వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచాలని, నంబరు పలకలు లేని వాహనాల విక్రయాలపై అనుమానం వస్తే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## హైకోర్టు జ్యుడీషియల్ అకాడమీ లో పాల్గొన్న మైదుకూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్




కడప అక్టోబర్ 11 (నంది పత్రిక రిపోర్టర్) అమరావతిలోని ఆంధ్రప్ర దేశ్ జ్యుడీషియల్ అకాడమీ నందు రెండు రోజుల పాటు జరిగిన న్యాయ విద్యా & శిక్షణ కార్యక్రమంలో మైదుకూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పాల్గొ న్నారు.రెండు రోజుల ప్రత్యే క సమావేశం విజ యవం తంగా ముగిసింది.

## ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించండి

**మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి**



ఒంగోలు బ్యూరో, అక్టోబర్12(నంది పత్రిక):- కేంద్ర, రాష్ట్రల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ రాష్టానికి ఎస్సి కార్పొరేషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు బాల వీరాంజనేయులు ను ఒంగోలు పట్టణంలో తన స్వగృహంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి ఒంగోలు నుంచి నంద్యాల జిల్లా మీడియా ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత పథకాలను ప్రవేశపెట్టాలని కోరామన్నారు. మరి ముఖ్యంగా బ్యాంకు లింకేజీ భూమి కొనుగోలు పథకం ఎన్ఎస్ఎఫ్ డిసి పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవుడు, మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపాత కొలమాన కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు...





**జూపాడు బంగ్లా అక్టోబర్ 13 (నంది పత్రిక)** మండలంలోని రెవెన్యూ వర్షపాత కొలమాన కేంద్రాన్ని సోమవారము కర్నూలు ఐఎండీ కార్యాలయానికి కె. నాగ లింగమయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో వర్షపాతాన్ని కొలిచే పరికరాలను, వర్షపాత నమోదుల రిజిస్టర్‌ను పరిశీలించారు. వర్షపాత కొలమాన పరికరాల పనితీరు, వర్షపాత నమోదుల నిర్వహణను ప్రతి రెండేళ్లకు ఒకసారి తనిఖీ చేసే కార్యక్రమంలో భాగంగా ఈ పరిశీలన చేపట్టా మన్నారు. వర్షపాత వివరాలను కచ్చితంగా నమోదుచేయడంతోపాటు, రిజిస్టర్‌లో నమోదైన వివరాలను నిశితంగా పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ, కచ్చితమైన వర్షపాత వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు అందించడం ద్వారా భవిష్యత్తులో వాతావరణ పరిస్థితులను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి వీలవుతుందని తెలిపారు. జూపాడు బంగ్లా మండలంలో వర్షపాత రిజిస్టర్‌ను 1988 సంవత్సరం నుంచి నేటి వరకు చక్కగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జూపాడు బంగ్లా మండల తహశీల్దారు చంద్రశేఖర్ నాయక్ , డిప్యూటీ తహశీల్దారు పి. సత్య దీప్ , రిసర్వే డీటీ నాగన్న మరియు ఏఎస్ఓ హనుమంతు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

### ప్రజా ఫిర్యాదుల వేదికకు 18 అర్జీలు

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 18 అర్జీలను స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్.ఈ. రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సోమవారం ప్రజా సమస్యల పరిష్కర వేదిక లో దసరా సెలవులో వర్క్ షాప్ పేరుతో నారాయణ విద్యాసంస్థలలో తరగతులు నిర్వహిస్తున్నారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఈరేష్ బి.రంగస్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలకు దసరా సెలవులని ప్రభుత్వం ప్రకటించిదన్నారు. నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం మాత్రం ప్రభుత్వ నియమ నిబంధనలు మాకు వర్తించవు, మా మంత్రి నారాయణ చెప్పినట్టు గానే మేము నడుచుకుంటామంటూ వ్యవహరించడం సరైంది కాదన్నారు. విద్యార్థులను తరగతుల పేరుతో ఉపాధ్యాయులకు వర్క్ షాప్, పేరుతో ట్రైనింగ్ నిర్వహిస్తూ మానసికంగా ఒత్తిడికి గురిచేయడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని నారాయణ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ ను కోరారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శి ఎస్. అభిషేక్, సి.అశోక్ జిల్లా సమితి సభ్యులు మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో సంగమేశ్వర స్వామి దర్శనం

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని సప్తనదీ తీరంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయం మరి కొద్ది రోజుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనుంది. సోమవారం శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 843 అడుగులకు చేరుకుంది. మరో మూడు అడుగులు నీరు తగ్గితే పూర్తి స్థాయిలో సంగమేశ్వరాలయంలోని వేపధారు శివలింగం భక్తులకు దర్శనం కలుగుతుంది. అదేవిధంగా ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో దసరా నవరాత్రుల్లో భాగంగా లలితా దేవి అమ్మవారిని ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# కర్నూలు నగర పేదలు ఆంధ్రప్రదేశ్లో లేరా,,,

### సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు పేద ప్రజల సొంతింటి కల నెరవేరాలని 8వ రోజు సాగుతున్న దీక్షలకు సిపిఐ పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు అధ్యక్షత వహించగా సంఘీభావంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బి గిడ్డయ్య నగర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి లక్కీ లెనిన్ బాబు హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు దీక్షలు చేస్తావుంటే జిల్లా ప్రథమ మేజిస్ట్రేట్ జిల్లా అధికార యంత్రాంగం చూస్తూ పోతా ఉన్నారు తప్ప ఏమాత్రం స్పందన కనిపించడం లేదు దీనికంతటికి కారణం అధికారులపై కూటమి ప్రభుత్వ అధినేత ఆంక్షలు ఏ విధంగా ఉన్నాయో ప్రజలకు అర్థమవుతా ఉంది పేద ప్రజలకు రెండు సెంట్ల ప్రభుత్వ స్థలం ఇవ్వాలంటే ఆధార్ కార్డు పరిశీలించి అర్హత ఉన్న వాళ్లకు ఇంటి స్థలం ఇస్తామని చెప్పిన మీరు రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కార్పొరేట్ వ్యక్తులకు తక్కువ ధరలకే భూములు కట్టబెడుతున్న వారి యొక్క ఆధార్ కార్డులు పరిశీలించి భూములు కట్టబెడితే బాగుంటుందని వారు తెలియజేశారు తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత అనుభవము ఉన్నటువంటి వ్యక్తి అయితే ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడని అప్పుడు చంద్రబాబునాయుడుకి పట్టం కట్టబెట్టారు ఇచ్చినటువంటి హామీలు అప్పుడు కూడా నెరవేర్చనందుకు 2019 ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పారు అయితే గత ప్రభుత్వం కూడా ఇదే తరహా ఆలోచనలు పాలనను కొనసాగించినందున వారికి కూడా తగిన బుద్ధి చెప్పారు అయితే ఒకసారి తప్పు చేసివారికి మరొకసారి అవకాశం ఇవ్వాలని ఆంధ్ర ప్రజలు ముఖ్యంగా రాయలసీమ కర్నూలు జిల్లా ప్రజలు పెద్దన్నగా ఇంటి పెద్ద కొడుకుగా హామీలు ఇచ్చి నెరవేరుస్తానని గతంలో చేసిన తప్పులు మరొకసారి చేయనని ప్రజలకు కల్లబొల్లి హామీలు ఇచ్చి గద్దెనెక్కినటువంటి కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరం గడుస్తా ఉన్న హామీలు నెరవేర్చకుండా పండగొచ్చినప్పుడే ఇల్లు అలకాలనే చందంగా స్థానిక సంస్థల ఎలక్షన్ల దృష్టిలో ఉంచుకొని విజయవాడ విశాఖపట్నంలో పేదలకు పట్టాల పంపిణీ పేరుతో పట్టాభిషేకం చేసుకుంటున్నారు కర్నూలు జిల్లా ప్రజలపై సవతి తల్లి ప్రేమ ఎందుకు అని ఎద్దేవా చేశారు అయితే గతంలో చేసిన తప్పులే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు కావున ఈసారి వచ్చేటువంటి స్థానిక అసెంబ్లీ ఎలక్షన్లో మిమ్మల్ని శాశ్వతంగా ఇంటి దగ్గర కూర్చునే విధంగా తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలను కలిసి వచ్చే వారితో కలిసి దశలవారీగా ఆందోళనలు చేసి సొంతింటి కల నెరవేర్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితిగా వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగర కార్యవర్గ సభ్యులు ఎం బీసన్న భద్ర కుమార్ ఈశ్వర్ బంగారు పేట సురేష్ డప్పు కళాకారులు మాణిక్యం మధు చంద్ర రాజేశ్వరరావు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెవిన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు.



**బేతంచెర్ల అక్టోబర్ 12 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామ పేద రైతు అగు పి.బాలకృష్ణ( సన్ ఆఫ్) పి. సుబ్బరాయుడు( లేట్ )ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అంబాపురం విఆర్ఓ చుట్టూ, గత నాలుగు నెలలుగా తిరుగుతున్న పట్టించు కోవడం లేదని ఎపి.రైతు సంఘం నాయకులకు తెలియ జేయడం జరిగింది. సోమవారం నాడు గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బ రాయుడు, రైతు సంఘం బేతంచెర్ల మండల అధ్యక్షులు సి.మద్దిలేటి స్వామి లు, బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణికి,ఈ సమస్యపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. పేద రైతగు బాలకృష్ణకు న్యాయం చేయండని కోరడమైనది. అందులకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. తహసీల్దార్ తో పాటు బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధికారి ఎం.ఫజుల్ రహిమాన్, బేతంచెర్ల నగర పంచాయితీ కమిషనర్ డి.హరిప్రసాద్, తదితర అధికారులు కలరు.

# పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సామాజిక న్యాయం మరియు సాధికారతపై ఢిల్లీలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.. స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీ.పీ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ నాగరాజు హాజరయ్యారు.. సమావేశంలో భాగంగా 2026-27 కాలానికి సంబంధించి కమిటీ పరిశీలనకు స్వీకరించాల్సిన ముఖ్యమైన సామాజిక సంక్షేమ అంశాల పై చర్చించినట్లు ఎంపీ తెలిపారు.

# క్రికెట్ పోటీలను ప్రారంభించిన కోడుమూరు జనసేన పార్టీ సమన్వయకర్త సంధ్య విక్రమ్ కుమార్



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కోడుమూరు నియోజకవర్గం సి బెళగల్ పట్టణంలో దసరా పండుగ పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను జనసేన పార్టీ తరుపున స్థానిక నాయకులు గోపి ఆర్గనైజేషన్ లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త సంధ్యా విక్రమ్ కుమార్ అంతక ముందు బెళగల్ పట్టణంలో మండల నలుమూలల వచ్చిన జనసేన నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా వివాళులు అర్పించారు ఈ సందర్భంగా సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాలను జనసేన పార్టీ ప్రోత్సహిస్తుందని పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా యువత అన్ని రకాలుగా క్రీడల వైపు రానించాలని కోరారు ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు వెంకటరాముడు మోడల్ స్కూల్ చైర్మన్ ప్రేమర దస్తగిరి ఫరూక్ పోల్కల్ యువరాజు బాలముని నాగేష్ మరెప్ప సుభాకర్ మద్దిలేటి లక్ష్మన్న మహానందిరెడ్డి హనుమన్న పరమేష్ మధు వెంకటేష్ దానమన్నా మరియు భారీగా జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు. సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, “ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి.

# ఉద్యోగుల ఆస్తుల కబ్జాదారు వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే

### 99 ఏళ్ల అక్రమ లీజును వెంటనే రద్దు చేయాలి

### టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మి సలీం ని, ఏపీఎన్జీవో ఉద్యోగులను ఆమె కలిసి సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని, ఏపీఎన్జీవో భవనాన్ని తిరిగి ఉద్యోగులకు అప్పగించాలన్న వారి డిమాండ్‌కు మద్దతు తెలిపారు. ఆదోని పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, కార్యకలాపాల కోసం కేటాయించిన ఏపీ ఎన్ జి ఓ భవనాన్ని, నాటి వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే తన బినామీ పేరు మీద 99 సంవత్సరాలకు అక్రమంగా లీజుకు తీసుకొని పార్టీ కార్యాలయంగా మార్చుకోవడం పచ్చి దోపిడీకి, తీవ్ర అధికార దుర్వినియోగానికి తార్కాణమని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆది కృష్ణమ్మ వ్యక్తంచేసిన ముఖ్య విషయాలు: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమం కోసం కేటాయించిన భవనాన్ని తమ సొంత ఆస్తిలా భావించి కబ్జా చేయడం సిగ్గుచేటు. నాటి అధికార మదంతో ఉద్యోగ సంఘాల ఆస్తులను సైతం వదలకుండా దోచుకున్నారు. వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే చట్ట విరుద్ధంగా, నిబంధనలను బొందపెట్టి తన అనుచరుల పేర్లతో 99 సంవత్సరాల సుదీర్ఘ లీజు కాగితాలు సృష్టించారు. ప్రజాసంఘాల భవనంలో పార్టీ జెండాలు కప్పుకుని రాజ్యమేలడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. కూటమి ప్రభుత్వంలో అక్రమార్కులకు తావు లేదు. నిబంధనలకు విరుద్ధంగా కుదుర్చుకున్న ఈ 99 సంవత్సరాల అక్రమ లీజు ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఆ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని ఏపీ ఎన్ జి ఓ సంఘానికి/ప్రభుత్వానికి అప్పగించాలి. మాజీ ఎమ్మెల్యే అనుచరులు పేర్లతో ప్రభుత్వ, ఉద్యోగుల ఆస్తులను అన్యాక్రాంతం చేసిన మాజీ ఎమ్మెల్యేతో పాటు, నాటి కాలంలో ఈ అక్రమాలకు సహకరించిన అధికారులపై చట్టపరంగా తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలి. “ప్రజాధనాన్ని, ఉద్యోగుల ఆస్తులను దోచుకున్న ఏ ఒక్క వైయస్సార్సీపీ నాయకుడిని వదిలేది లేదు. ఆదోని ఎన్ జి ఓ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేంత వరకు తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుంది.“ ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి, జనసేన పట్టణ అధ్యక్షుడు రేణు వర్మ, ఏపీఎన్జీవో ఉద్యోగులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో స్థానిక సత్రాలవారితో సమావేశం



**శ్రీశైలం అక్టోబరు12(నంది పత్రిక)** దేవస్థానం పరిధిలోని ప్రైవేటు సత్రాల యాజమాన్యాలతో (12.10.2026) ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దేవస్థానం కార్యాలయములోని సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, శ్రీ దేవకి వేంకటేశ్వర్లు , శ్రీ చిలువేరు కాశినాథ్ లు పాల్గొన్నారు. సమావేశంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా దేశములోని అన్ని రాష్ట్రాల నుంచి కూడా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో అందరు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా క్షేత్ర పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావించాలన్నారు. క్షేత్రానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినంత వసతి, భోజన సదుపాయాలతో సత్రాల యజమానులు భక్తులకు సహకరించాలని కోరారు. దేవస్థానం అభివృద్ధికి అందరు సహకరించాలి అన్నారు. అంతకు ముందు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం శ్రీశైలమహాక్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకు అవసరమైన మౌలికసదుపాయాలను దేవస్థానం దశలవారిగా కల్పించడం జరుగుతుందన్నారు. అన్ని సత్రాల వారు కూడా సేవా దృక్పథంతో క్షేత్రాభివృద్ధికి సహకరించాలన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ కాశీనాథ్ చిలువేరు మాట్లాడుతూ పలు సత్రాల వారు అన్నదానసేవను చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే వసతిని కూడా కల్పిస్తారన్నారు. దేవస్థాన అభివృద్ధిలో అన్నీ సత్రాల వారు భాగస్వామ్యం కావాలన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ దేవకి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్రాల యజమానులు అందరు సేవా భావంతో పనిచేస్తున్నారని చెబుతూ వారి సేవలని కొనియాడారు. ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ చిట్టిబొట్ల భరద్వాజశర్మ మాట్లాడుతూ దేవస్థాన అభివృదికై దేవస్థానం మరియు సత్రాల ప్రతినిధులు కలిసి సమన్వయ కమిటీగా ఏర్పడి దేవస్థానం అభివృద్ధికి మరింతగా పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ సత్రాల నిర్వాహకులు వారి సూచనలు తెలియజేశారు. ఇటువంటి సమావేశాలు మరిన్ని జరపాలని కోరారు. దేవస్థాన అభివృద్ధికి ప్రతి సత్రయాజమాన్యం సహకరిస్తుందనీ తెలిపారు. అనంతరం సమావేశంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి అధ్యక్షులను మరియు కార్యనిర్వహణాధికారి వారిని, సభ్యులను సత్రయాజమాన్యాల వారు సత్కరించారు. ఈ సమావేశంలోదేవస్థానం రెవెన్యూ అధికారులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



# జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... “జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం“ అని అన్నారు.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న ప్రభుత్వ చర్యలు అక్రమ అరెస్టులతో

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాయలేరు

### ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే సహించేది లేదు అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ఉద్యమాన్ని ఆపలేరు ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తే ప్రజా ఉద్యమమే సమాధానం అన్న కాంగ్రెస్ కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాలను అడ్డుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ తీవ్రంగా విమర్శించారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కళా వెంకట్రావు భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు.ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి, రాష్ట్ర ఇన్‌ఛార్జి పీవీ మోహన్, ఏఐసీసీ కార్యదర్శి పాలక వర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి తదితర నాయకులు శాంతియుతంగా రాజ్‌భవన్ (లోక్‌భవన్)కు వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో వారి నివాసాల వద్ద భారీగా పోలీసులను మోహరించి అడ్డుకోవడం, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని క్రాంతి నాయుడు బోయ అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, నిరసన తెలియజేసేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పోలీసు చర్యలతో అణచివేయడం సరికాదని పేర్కొన్నారు.

**ఛలో ఢిల్లీ, ఛలో లోక్‌భవన్ పిలుపును అడ్డుకోవడం అప్రజాస్వామికం** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా రాష్ట్రంలోని పలువురు డీసీసీ అధ్యక్షులను అడ్డుకోవడం, కర్నూలులో సైతం తమను అరెస్టు చేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. ప్రజల ఓటు హక్కు, ఎన్నికల పారదర్శకత, రాజ్యాంగ సంస్థల జవాబుదారీతనం వంటి కీలక అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష గొంతును అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై పోరాడటం దాని బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్న కాంగ్రెస్ నాయకులను నిర్బంధించడం ద్వారా ప్రజల గొంతును మూయించలేరని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసే అంశంపై కాంగ్రెస్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలిఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల జాబితాల సవరణలో తలెత్తుతున్న అనుమానాలు, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి తమ ఆందోళనలను వివరించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగమని క్రాంతి నాయుడు బోయ పేర్కొన్నారు. ఈ అంశంపై న్యాయపరమైన మార్గాలను అనుసరించాలని సూచించిన నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత రాజ్యాంగ సంస్థలపై ఉందన్నారు.ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరగాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును కాపాడటం ప్రతి ప్రభుత్వానికి, ప్రతి రాజ్యాంగ సంస్థకు అత్యంత కీలకమైన బాధ్యత అని స్పష్టం చేశారు.

**పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం కల్పించాలి**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల పారదర్శకత, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్షాలు ప్రశ్నించే అవకాశం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. పార్లమెంటు సమావేశాలు, చర్చలు ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపే వేదికలుగా ఉండాలని, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం తగదని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు సమర్థవంతంగా పనిచేయడం, ప్రభుత్వ జవాబుదారీతనం కొనసాగడం అత్యవసరమని తెలిపారు.

**కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి**

కర్నూలు జిల్లాలో నెలకొన్న వ్యవసాయ, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని క్రాంతి నాయుడు బోయ డిమాండ్ చేశారు. జిల్లా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కర్నూలు జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని కోరారు.రైతులకు తక్షణ ఉపశమనం కల్పించేలా పంట నష్టాల అంచనా, నష్టపరిహారం, పంటల బీమా, సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కరువు పరిస్థితులపై తగిన చర్యలు తీసుకోకపోతే జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు, రైతుల పక్షాన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సన్నద్ధమవుతోందని క్రాంతి నాయుడు బోయ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రజలతో మమేకమై పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్న ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. చివరగా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, ప్రజాస్వామ్య హక్కుల అణచివేతను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, రైతుల సంక్షేమం, కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం జిల్లా కాంగ్రెస్ కమిటీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కర్నూలు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అతిఫ్ అలీ ఖాన్, ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు షేక్ రియాజుద్దీన్, జి శ్రీనివాసులు, చిన్నస్వామి, ఆర్ విజయభాస్కర్ మొదలగువారు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై ఎస్పీ స్పందన

### 120 ఫిర్యాదులు స్వీకరణ.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు--




**నంద్యాల క్రైం, అక్టోబర్ 12(నంది పత్రిక):–** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ 120 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ సునీల్ షోరాణ్ భరోసా ఇచ్చారు. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలని, అలసత్వం వహించరాదని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## 34 వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరి చరిత రెడ్డి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు అర్బన్ 34 వ వార్డ్ శ్రీనివాస నగర్ లో రూ 40 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్ల పనులకు ముఖ్య అతిథులుగా పాల్గొని భూమి పూజ చేసి,శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పాణ్యశీ నియోజకవర్గం ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హాయంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధికి ముందు అడుగు వేస్తూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు,కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## శాంతి మండల మహిళా సమాఖ్య కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కల్లూరు మండలం చిన్నటేకురు గ్రామంలో శాంతి మండల మహిళా సమాఖ్య కార్యక్రమం లో భాగంగా స్త్రీ శక్తి భవనం నిర్మాణశీ కొరకు భూమిని గౌరవ పాణ్యశీ నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి కేటాయించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరై భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ , కల్లూరు మండలం ఎమ్మార్వో ఆంజనేయులు , ఎంపిడిఓ శ్రీనివాసులు , పొదుపు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బనవాసి ఫారం లో ప్రభుత్వ హై స్కూల్,కాలేజీ,ప్రభూత్వ వసతిగృహం ఏర్పాటు చేయాలి.

### కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందచేసిన ఆర్వీపీఎస్ నాయకులు



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారం లో చుట్టుపక్క గ్రామాల విద్యార్థుల కోసం ప్రభుత్వ హైస్కూల్, కాలేజ్,విద్యార్థి సంక్షేమ వసతి గృహం నిర్మించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి జి నల్లారెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్,రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మదాసి సుంకన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారంలో దాదాపు 3500 ఎకరాలప్రభుత్వ భూమి కలదు అందులో ప్రభుత్వం అనేక కార్యాలయాలు,పరిశ్రమలు ఏర్పాటు చేయనుంది అయితే ఫారం చుట్టు పక్కన 15గ్రామాలు కలవు ఆయా గ్రామాలలో హై స్కూల్స్ లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఎమ్మిగనూరుకు వెళ్లిరావాల్సిన పరిస్థితి ఉంది అయితే గ్రామాలకు సమయానికి బస్సులు లేక విద్యార్థులు మద్య లోనే చదువుకు దూరమవుతున్నారని చుట్టు పక్కల గ్రామాలైన బనవాసి ,ఫారం ,పరమాన్ దొడ్డి, నక్కలమిట్ట, బోడబండ ,చెన్నా పురం ,దేవిబెట్ట ,కోటేకల్ , మల్కపురం ,బసాపురం గ్రామాలు తో పాటు పెద్దకడుబూరు మండలం రాగిమాన్ దొడ్డి, గంగుల పాడు గ్రామాల విద్యార్థులు ఎమ్మిగనూరు కు వెళ్ళి చదువుతున్నారని కావున బనవాసి ఫారంలో ప్రభూత్వ హైస్కూల్,కాలేజ్,సంక్షేమ హాస్టల్ ఎర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డిఈఓ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ సిరి స్పందిస్తూ తప్పకుండా ప్రయత్నిస్తామని తెలియజేశారు కార్యక్రమంలో నాయకులు రమేష్,వీరేష్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శీలం వారి శుభకార్యానికి ఎమ్మెల్యే కోట్ల సూర్య



**డోన్, అక్టోబర్ 12 నంది పత్రిక** డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లి గ్రామంలో శీలం కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన కేశఖండన శుభకార్యానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, చిన్నారులు వర్ణిక నాయుడు, ప్రజ్వల్ మనోహర్ నాయుడు, బాన్విక నాయుడు, జోశ్విక నాయుడులను ఆశీర్వదించారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డిని శీలం కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో జరిగే శుభకార్యాలు ఆనందాన్ని పంచడంతో పాటు బంధుత్వాలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై వారి కుటుంబ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని తెలిపారు. శీలం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కుటుంబంలో ఎల్లప్పుడూ ఐక్యత, ఆనందం, ఆరోగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, కుటుంబ వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనడం ద్వారా ప్రజలతో సత్సంబంధాలు మరింత బలపడతాయని స్థానికులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాకతో శీలం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శీలం భాస్కర్ నాయుడు, శీలం మధుసూదన్ నాయుడు, శీలం లక్ష్మీ వేణుగోపాల్ నాయుడు, శీలం చంద్రశేఖర్ నాయుడు, శీలం రామాంజనేయులు నాయుడు, శీలం కనుమన్న నాయుడు, బంధువులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### ఎన్నికల కార్యక్రమాలపైనా దృష్టి సారించాలి



**కడప బ్యూరో చీఫ్, అక్టోబర్ 12 నంది పత్రిక** ప్రజా ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించి, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధీమీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యకు అనుగుణంగా సరైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పొంతనలేని నివేదికలు సమర్పించరాదని హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి, సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి స్థాయిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.అదేవిధంగా మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ లు రంగస్వామి, వెంకటపతి, శివరామిరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మ వారు.

**బేతంచెర్ల అక్టోబర్ 12( నందిపత్రిక ).** దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆశ్వయుజ శుద్ధ విదియ సోమవారం నాడు బేతంచెర్ల పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని శ్రీ గాయత్రి దేవి అలంకారాముతో ఉదయం పూజాలను గంగారపు చంద్ర మౌళి వీరి భార్య లలితమ్మ, అయ్యపుశెట్టి శేష ఫణి వీరి భార్య పద్మజ, కీ. శే. నూకల పాపయ్య కుమారుడు శ్రీనివాస కుమార్ వీరి భార్య సువర్ణ, అలు వాల హరికృష్ణ వీరి భార్య ప్రమీలా రాణి మరియు రాత్రి పూజలు పసుపుల వెంకటేశ్వర్లువీరి భార్య వరలక్ష్మి, ఇస్కాల శ్రీనివాసులు వీరి భార్య లక్ష్మి కీ.శే. భజనపాటి సత్యనారాయణ వీరి కుమారుడు అనీల్ వీరి భార్య రవళి, వరదా శ్రీనివాసులు వీరి భార్య వనజా కుమారి, శ్రీ వాసవీ కిరాణ మర్చెంట్స్ అసోషియేషన్, గుండా సురేష్ బాబు వీరి భార్య జయలలిత, గుండా సుబ్బ వెంకటేశ్వర్లు వీరి భార్య ప్రభావతి (శభరీష్ టెక్స్ టైల్స్), వంకదారి ప్రసాదు వీరి భార్య ప్రభావతమ్మ కుమారుడు హరి సాయి వీరి భార్య వైష్ణవి, సోమ ఈశ్వర ప్రసాదు వీరి భార్య సుధా రాణి, బొగ్గరపు ధనుంజయ వీరి భార్య శ్రీ లలితా దేవి, కీ. శే.గుండా స్వామి శెట్టి వీరికుమారులు సునీల్ & సుజిత్, గుండా సత్య నారాయణ వీరి భార్య ఉమా దేవి, కీ. శే. రాచమడుగు వెంకట సత్య నారాయణ వీరి భార్య సౌభాగ్యవతి, శ్రీ మతి &శ్రీ రాఘవేంద్ర లు రాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గుండా వివేకానంద స్వామి & సన్,అమ్మవారికి పట్టు చీర (రూ. 2,500లు) ను సమర్పించారు. భక్తి శ్రద్దలతో, నియమ నిబంధనములతో ఆర్య వైష్యులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు

### అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో:** ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” (ౄబఎశ్రీఅష +తీఅవఋఅఎవ =వఁతీవంయిశ్రీ ౘాఎర్వఎ – ౢా+ౣా) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్‌ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారంలో జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారి పిటిషనర్ తో స్వయంగా మాట్లాడాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్‌ఎస్‌లో నమోదవుతున్న “రీ ఓపెన్”, “ఇంప్రాపర్ రెడ్రెసల్” కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించాలని అధికారులను ఆదేశించారు.

**ఎన్నికల విధుల నిర్వహణ పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి: జిల్లా కలెక్టర్**

తర్వలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై విధులు, శిక్షణ, సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలకు సంబంధించిన మార్గదర్శకాలు, మాన్యువల్స్‌ను అధికారులు పూర్తిగా అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అంశంపై నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధులు, బాధ్యతలపై స్పష్టతతో వ్యవహరించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, రామసుబ్బయ్య, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం డ్యామ్: అంతర్జాతీయ గుర్తింపు మరియు ఇంజనీరింగ్ ప్రాశస్త్యంపై సమగ్ర విశ్లేషణ

**వెలుగోడు అక్టోబర్ 12 నంది పత్రిక:**లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల జలప్రదాయిని అయిన శ్రీశైలం జలాశయానికి స్థానం లభించింది. భారతదేశంలోని జలవనరుల ప్రాజెక్టులలో ఈ విధమైన అంతర్జాతీయ గ్లోబల్ రికార్డు సాధించిన మొట్టమొదటి ప్రాజెక్టుగా శ్రీశైలం డ్యామ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ చారిత్రాత్మక రికార్డుకు సంబంధించిన అధికారిక ప్రశంసాపత్రాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సౌత్ రీజినల్ జాయింట్ సెక్రటరీ ఇలియాజర్, శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డికి మరియు నీటిపారుదల శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరఫున ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డి సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రాజెక్టు సాంకేతిక విశిష్టతలు మరియు రూపకల్పన పారామితులు** శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణాత్మక శైలి మరియు భౌగోళిక అమరిక ప్రపంచ నీటిపారుదల రంగంలో అత్యంత సంక్లిష్టమైనదిగా పరిగణించబడుతుంది. కృష్ణా నదిపై నల్లమల అటవీ ప్రాంతంలోని లోతైన కనుమ మార్గంలో, భూమండలంలో సముద్ర మట్టానికి సుమారు 980 అడుగుల ఎత్తులో ఈ భారీ డ్యామ్ నిర్మించబడింది. ఈ ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన రేడియల్ క్రస్ట్ గేట్లు 60 అడుగుల వెడల్పు మరియు 55 అడుగుల ఎత్తు కలిగి ఉండటం దక్షిణాసియాలోనే ఏ ఇతర ప్రాజెక్టుకూ లేని ప్రత్యేక సాంకేతిక అంశంగా గుర్తించబడింది. ఈ నిర్మాణాత్మక పరిమాణాలు అపారమైన జల ఒత్తిడిని సమర్థవంతంగా నిరోధించడానికి మరియు అత్యవసర సమయాల్లో వేగంగా నీటిని దిగువకు విడుదల చేయడానికి దోహదపడతాయి. 2009 చారిత్రక మహా వరద నిర్వహణ మరియు నిర్మాణాత్మక పటిష్టతప్రాజెక్టు మన్నికకు మరియు ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా 2009 అక్టోబర్ మాసంలో సంభవించిన రికార్డు స్థాయి విపత్తు నిర్వహణను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధాన ఆధారంగా స్వీకరించింది. ఆ సమయంలో కృష్ణా మరియు తుంగభద్ర జలానయన ప్రాంతాల నుండి ఏకంగా 25.4 లక్షల క్యూసెక్కుల అపారమైన ప్రవాహం శ్రీశైలం రిజర్వాయర్‌కు వచ్చి చేరింది. ప్రాజెక్టు రూపకల్పన పరిమితులను అధిగమించిన స్థాయిలో జలవిస్ఫోటనం సంభవించినప్పటికీ, ప్రధాన డ్యామ్ నిర్మాణం ఎటువంటి అంతర్గత లేదా బాహ్య విచ్ఛిత్తి లేకుండా అత్యంత పటిష్టంగా నిలిచింది. ఆనాటి ఉధృత ప్రవాహాన్ని సురక్షితంగా నిరోధించిన తీరు మరియు డ్యామ్ చూపిన బలం అంతర్జాతీయ ఇంజనీరింగ్ నిపుణుల ప్రశంసలు అందుకోవడానికి కారణమైంది.



**ప్రాంతీయ ప్రయోజనాలు మరియు ఇంజనీర్ల పాత్రకు గుర్తింపు** శ్రీశైలం ప్రాజెక్టు కేవలం నీటి నిల్వ జలాశయంగానే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల తాగు, సాగునీటి అవసరాలకు మరియు పవర్ గ్రిడ్ స్థిరత్వానికి కీలక ఆధారంగా నిలుస్తోంది. శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్, కేసీ కెనాల్, హంద్రీ-నీవా మరియు కల్పవృక్ష వంటి వివిధ కాలువ వ్యవస్థల ద్వారా రాయలసీమలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందుతోంది. దీనితో పాటు తమిళనాడులోని చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఈ జలాశయం ద్వారా నీటి విడుదల సాగుతోంది. ఈ అంతర్జాతీయ గుర్తింపు సందర్భంగా, ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆనాటి ఇంజనీర్ల శ్రమను, రూపకల్పన నైపుణ్యాన్ని శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రత్యేకంగా కొనియాడారు. అదేవిధంగా, ప్రాజెక్టు విశిష్టతలను సరైన సాంకేతిక ఆధారాలతో అంతర్జాతీయ సంస్థకు నివేదించి రికార్డు నమోదుకు కృషి చేసిన ఇరిగేషన్ అధికారులను ఆయన అభినందించారు.

**భవిష్యత్తు నిర్వహణ మరియు బాధ్యతలు**

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ ద్వారా లభించిన ఈ అంతర్జాతీయ పురస్కారం శ్రీశైలం ప్రాజెక్టు సాంకేతిక ప్రతిష్టను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, భవిష్యత్తు ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర బాధ్యతను మోపింది. జలాశయ నిర్మాణ భద్రతను ఎప్పటికప్పుడు సమీక్షించడం, డ్యామ్ దిగువ భాగంలో ఏర్పడే ప్లంగ్ పూల్ క్రమక్షయాన్ని అరికట్టడం మరియు క్రస్ట్ గేట్ల ఆపరేషనల్ మెకానిజమ్‌లను ఎప్పటికప్పుడు ఆధునీకరించడం తదితర అంశాలపై వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

రాబోయే కాలంలో వాతావరణ మార్పుల వలన కలిగే అనిశ్చిత వరదలను తట్టుకుంటూ ప్రాంతీయ జలభద్రతను కాపాడటంలో ఈ ప్రాజెక్టు సురక్షిత నిర్వహణ కీలక పాత్ర పోషించనుంది.

## 106 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

### మౌలిక సదుపాయాల కల్పనతో నగర జీవన విధానం మార్పు: కమిషనర్ జయకృష్ణ



**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** నగరపాలక సంస్థ పరిధిలో 106 కోట్ల రూపాయల హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగు పరచనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం కింద రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, డివైడర్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. గొల్లవాణిగుంట పరిధిలోని శ్రీనివాస నగర్ లో సోమవారం ఉదయం హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం(హ్యామ్) కింద నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ జయకృష్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కార్పొరేషన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం కింద 106 కోట్లు కేటాయించి నగర సుందరీకరణకు వారు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. హ్యామ్ పథకం కింద చేపట్టే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటిల్లో వెయ్యి కోట్లకు పైగా నిధులతో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కమిషనర్ జయకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతికి 106 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ నిధులతో రోడ్లు, పార్కులు, డ్రైనేజీ, వీధి దీపాలు, డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుతో నగర జీవన విధానం మారిపోతుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ ల విజన్ తో నగర రూపురేఖలు మారుతాయని ఆయన తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, టిడిపి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ జేబి శ్రీనివాస్, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, ఎస్.ఈ శ్యామ్ సుందర్, ఈ.ఈ.గోమతి, డి.ఈ రమణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు





## గజ వాహనంపై 'బ్రహ్మచారిణి'గా కామేశ్వరి దేవి దర్శనం

**మహానంది, అక్టోబర్ 12 (నంది పత్రిక):-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీ కామేశ్వరి అమ్మవారు శ్రీ బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో గజ వాహనంపై కొలువై భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు.ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డిల సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు, మరియు అర్చకులు ఆలయ యాగశాలలో శాస్త్రోక్తంగా చండీ హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. సాయంత్రం వేళ అలంకార మండపంలో అమ్మవారికి కనులపండువగా సహస్ర దీపాలంకరణ సేవ,అష్టవిధ మహా మంగళ హారతులు సమర్పించారు. యాగశాలలో భక్తులచే సామూహిక కుంకుమార్చన పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గజ వాహనంపై బ్రహ్మచారిణి దుర్గగా అలంకృతురాలైన అమ్మవారికి వేద పండితులు ,అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం,మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు,ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, పూజా కార్యక్రమాల దాతలు, దేవస్థానం అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







## యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక** సోమవారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆళ్లగడ్డ మండలం పెద్ద కందుకూరు గ్రామంలో వెలిసిన శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి కి ఉదయం తిరుపాల్ దంపతులు,భక్తుల చేత అభిషేకాలు, విశేష పూలలంకరణ నిర్వహించడం జరిగినది తీర్థప్రసాదాలు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ వారి చేతులు మీదుగా నిర్వహించడం జరిగింది. అలాగే శ్రీరామ దండు భజన సంఘం పుల్లయ్య వారిచే భజన కార్యక్రమం జరిగినది.

## నగరపాలక సంస్థకు 39 వినతులు.



**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని రెవిన్యూ అధికారి రవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 13 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 26 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. సుబ్బారెడ్డి నగర్ నందు అనుమతులు లేకుండా బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారని పిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు పరిశీలించాలని, నెహ్రూ నగర్లో ఇండ్ల మధ్యలో చెత్త వేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ గృహాల కొరకు కట్టిన నగదు తిరిగి ఇప్పించాలని, శ్రీ నగర్ కాలనిలో తెలుగుగంగ నీరు సక్రమంగా రావడం లేదని, ఆర్.కె.పురంలో కాల్వలు శుభ్రం చేయడం లేదని, బొమ్మగుంట, నారాయణ పురంలో కాలువలు, రోడ్లు పాడైపోయాయి మరమ్మత్తులు చేయించాలని, తాతయ్యగుంటలో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని, సుందరయ్య నగర్ దోభీ ఘాట్ ను మరమ్మత్తులు చేయించాలని, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదని పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పశువుల పేటలో సిసి రోడ్డు నిర్మించండి



### నీటి సరఫరాను పునరుద్ధరించండి.

**శిరివెళ్ల (నంది పత్రిక):-** సిరివెళ్ల మండల కేంద్రంలోని పసుల పేటలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పసుల రామకృష్ణ యాదవ్ మరియు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని

ఎంపీడీఓ సి శివ మల్లేశ్వరప్పకు వినతి పత్రం అందజేశారు. శిరివెళ్ల నడి ఊరిలో పసుల పేట ఉన్నదని సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన సిసి రోడ్డు శిధిలమై గుంతల మయంగా మారిందన్నారు.

గతంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సి సి రోడ్డు వేయకపోవడం వల్ల డ్రైనేజీ ఎత్తుగా రహదారి తక్కువగా మారిందని కాలనీ ప్రజలు అర్జిలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ తాగునీటి సరఫరా సైతం తమ కాలనీలో లేదని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కు ఫిర్యాదు చేశారు.పల్లె పండుగ కింద విడుదలైన నిధుల ద్వారా పసుల పేటలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి మౌలిక వసతుల కల్పన కు కృషి చేయాలని కాలనీ ప్రజలు పేర్కొన్నారు.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం

**వెలుగోడు, అక్టోబర్ 12 (నంది పత్రిక):**వెలుగోడు పట్టణంలోని స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజు సోమవారం రోజున అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని దేవస్థాన కమిటీ కోరుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు

## శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో మండల మహిళ సమాఖ్య భవనం నిర్మాణానికి అధికారులు స్థలము కేటాయించారు. ఈ కేటాయించిన స్థలం నందు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మండల మహిళ సమాఖ్య భవనానికి భవన నిర్మాణం కూడా తొందరలోనే శాంక్షన్ అయ్యేటట్లుగా చేస్తానని అన్నారు. మండలంలో ఉన్న 37 గ్రామ సంఘాల అభ్యున్నతి, సాధికారత కొరకు మండల సమాఖ్య భవనాన్ని నిర్మాణం చేయించడం జరుగుతుందని, అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంటుందని చిన్నటేకూరు గ్రామాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ శ్రీధర్ రావు, ప్రత్యేక అధికారి డాక్టర్ కే వేణుగోపాల్ రావు, మండల తహసిల్దార్ కె ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాసులు, పిఆర్ ఏఇ రవి మోహన్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఇ సతీష్, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఏపీ విశ్వకర్మ కార్పొరేషన్ ఛైర్మెన్ కె పార్వతమ్మ, ఉలిందకొండ, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షులు ఇ వి రమణ, పర్ల శేఖరు, పొదుపు సంఘం అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, చిన్నటేకూరు గ్రామ పెద్దలు టీ రామాంజినేయులు కె శేషగిరి, బజారన్న, లక్ష్మన్న మండల సమాఖ్య అధ్యక్షురాలు జుబేదా బి, డి ఆర్ డి ఏ వెలుగు ఏపీఎం భోగాపుష్పవతి, సి సిలు, వివిధ గ్రామాల నుంచి పొదుపు మహిళలు వి ఓఏలు గ్రామ సంఘం లీడర్లు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా కె నాగేశ్వరమ్మ

### కాటసాని రామభూపాల్ రెడ్డిని కలిసిన నాగేశ్వరమ్మ



**కర్నూలు సిటీ నంది పత్రిక** వైఎస్ఆర్సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియ మితు లైన కె నాగేశ్వరమ్మ వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా కాటసాని రామ భూపాల్ రెడ్డికి పూలమాల వేసి సత్కరించారు, తనకు ఈ పదవిలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీసీ వర్గాల అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని కె. నాగేశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు నాయకులు నల్లబోలు గోపాల్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపాలు, వేదవతి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల్లో మెరిసిన మెప్మా బృందాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం, బ్యూరో చీఫ్ అక్టోబరు 12. నంది పత్రిక** స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల్లో గుర్తింపు సాధించిన మెప్మా బృందాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. విజయవాడలో అక్టోబర్ 2న జరిగిన 2026 స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్న నరసాపురం కు చెందిన వి.లక్ష్మీ రాజేశ్వరి, బృందం మెప్మా ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టరేట్ పీ జీ ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో మెప్మా బృందం సాధించిన గుర్తింపుపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ, బృంద సభ్యులను అభినందించారు. పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో పశ్చిమ గోదావరి జిల్లా కు గుర్తింపును తీసుకురావడం అభినందనీయమని అన్నారు. స్వచ్ఛతపై ప్రజలలో మరింత అవగాహన కల్పించి మెప్మా సిబ్బంది మరింత చురుకుగా పనిచేయాలని భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు సాధించాలని ఆకాంక్షించారు. మెప్మా పి డి హెప్సిబా,ఐ బి సిహెచ్ మోహన్, నరసాపురం దేవాంగుల పేట బృందం తదితరులు పాల్గొన్నారు.

## లింగ ఎంపికను అరికట్టండి ఆడపిల్లను కాపాడండి లఘు చిత్రాల పోటీల విజేతలకు బహుమతుల అందజేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి







**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పిసి అండ్ పి ఎన్ డి టి చట్టంపై అవగాహన కల్పిస్తూ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో లింగ ఎంపికను అరికట్టండి ఆడపిల్లను కాపాడండి అనే అంశంపై జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి లఘు చిత్రాల (షార్ట్ ఫిలిం) పోటీల విజేతలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తణుకు ఎస్.సి.ఐ.ఎమ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నోడల్/ఐడి కళాశాల సౌజన్యంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ముగ్గురు నిపుణులతో కూడిన న్యాయ నిర్ణేతల బృందం వచ్చి 8 లఘు చిత్రాలను సమగ్రంగా పరిశీలించి ఫలితాలను వెల్లడించ గా సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలోపోటీల లో విజేతలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ప్రథమ బహుమతి రూ. 30, వేలు ఎన్. ఉమాదేవి మూడవ సంవత్సరం బి ఎస్ ఎస్ సి టీం కు, తాడేపల్లిగూడెం డి.ఆర్.జి. ప్రభుత్వ కళాశాల, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు బి. ప్రవల్లిక రెండవ సంవత్సరం బి ఎస్ సీ టీమ్, తణుకు ఎస్.సి.ఐ.ఎమ్. ప్రభుత్వ కళాశాల ఎ ,తృతీయ బహుమతి రూ. 10, వేలు పి. మౌనిక మూడవ సంవత్సరం బి ఎస్ సి టీమ్, గెలుపొందడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రవిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఈ ఎం ఓ రాజా హక్కులు,కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపకులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..




# లక్ష్మీదేవి అలంకారంలో శ్రీ కాళికామాత అమ్మవారు





**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక** పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీ శ్రీ కాళికామాత అమ్మవారి ఆలయం నందు రెండవ రోజు అమ్మవారు శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో కొలువుదీరారు ఉదయం ఆరు గంటలకు పంచామృత అభిషేకం నిర్వహించి అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించిన ఆలయ అర్చకులు విల్లనూరిచంద్రశేఖరాచార్యు లు ఉదయం పూజ ఉభయదారులుగా కీర్తిశేషులు శిల్పి ఎన్ వి రామకృష్ణమాచార్యులు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి తీర్థ ప్రసాద వినియోగం జరిగినది. సాయంత్రం పూజ ఉభయదారులుగా దేవ పూజ హరికృష్ణ ఆచార్యులు దంపతులు పూజలు నిర్వహించడమైనది. సాయంత్రం 6 గంటల నుండి వేద కూచిపూడి కళానిలయం గురువు తేజేశ్వర్ ఆచార్య చే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమం నందు దేవస్థాన కమిటీ అధ్యక్షులు యర్రపనూరి శ్రీనివాసాచార్యులు ఉపాధ్యక్షులు, ముత్తలూరు సురేష్ ఆచార్యులు ,గౌరవ అధ్యక్షులు టీ కోటేశ్వరరావు ఆచార్యులు , వడ్ల పెద్ద సుబ్బయ్య ఆచార్యులు గారు, మరియు కమిటీ ప్రధాన కార్యదర్శి యాదికి గోపాల్ ఆచార్యులు, సహాయ కార్యదర్శి గుల్లకుంట సుబ్బయ్య చార్యులు, కోశాధికారి రామ్మోహనాచా ర్యులు, కమిటీ మెంబర్లు కంబాలదిన్నె ఓబయ్య ఆచార్యులు, కమ్మరి గురుమూర్తిచార్యులు, విజయ్ కుమార్ ఆచార్యులు, బాణాల సత్యనారాయణ చార్యులు, బాణాల గోపాలాచార్యులు, వృద్ధ ఆచార్యులు, లోకేష్ ఆచార్యులు ఉద్దండం రవికుమార్ ఆచార్యులు, మహిళా కమిటీ అధ్యక్షురాలు విశాలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు పుల్లమ్మ, విజయ,జమీల,గోవిందమ్మ, మొదలైన వారు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది కార్యక్రమం అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

## ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితాల తయారీపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** తూర్పుపశ్చిమ గోదావరి, కృష్ణ-గుంటూరు ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గాల ఓటరు జాబితాల తయారీ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాల తయారీపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ పదవీకాలం 2027 మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో, కొత్త ఓటరు జాబితాల తయారీకి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. తూర్పుపశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి 2026 నవంబర్ 6వ తేదీ చివరి గడువు అని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ఉపాధ్యాయులు నిర్ణీత గడువులోగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు గా నమోదు కావాలనుకునే వ్యక్తి భారత దేశ పౌరుడై ఉండాలని మరియు సంబంధిత నియోజకవర్గంలో నివసించాలని ఆమె అన్నారు. ఓటరు ఫారం 19 లో దరఖాస్తు తో పాటు 1 నవంబర్ 2026 నాటికి గడిచిన ఆరు సంవత్సరాలలో మూడు సంవత్సరాలా పాటు ఉన్నత పాఠశాల , కళాశాల యందు టీచర్, లెక్చరర్ గా పని చేస్తున్నట్లు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థ అధిపతి నుండి ఒక ధ్రువీకరణ పత్రాన్ని కలిగి ఉండాలని, దరఖాస్తు తేదీలో బోధనలో లేని వ్యక్తి విషయంలో అతను చివరిగా పనిచేసిన సంస్థ అధిపతి చే సర్టిఫికెట్ సంతకం చేయబడాలని ఆమె వివరించారు.దరఖాస్తులను ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా, సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1950, లేదా స్థానిక తహసీల్దార్ వారి కార్యాలయములను సంప్రదించవచ్చునని ఆమె అన్నారు.ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ , ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు నమోదు కోసం సమర్పించిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయుల వివరాలు మాత్రమే జాబితాలో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితాల తయారీకి సంబంధించిన వివిధ దశలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణ ప్రక్రియలను నిబంధనల మేరకు నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఓటు చోరీ పై ప్రశ్నిస్తే కేసులా తప్పును ఒప్పుకొని జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి... సీపిఐ




**బనగానపల్లె అక్టోబర్ 12నంది పత్రిక** ఎన్నికల వ్యవస్థలో జరిగిన అవకతవకలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని, ఓట్ చోరీ ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు.సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నప్పుడు వాటిని నివృత్తి చేయాల్సింది పోయి, ప్రశ్నించే గొంతులను అణిచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఓట్ల చోరీ జరిగిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు చేస్తున్న ఊకదంపుడు ఉపన్యాసాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా వ్యవహరించాలని హితవు పలికారు. ఓట్ చోరీపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థ పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై ఉందని, ఆరోపణలపై సమాధానం చెప్పి తప్పు జరిగితే బాధ్యత వహించాలని, నైతిక బాధ్యతగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని శివయ్య డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కును కాపాడాలని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించాలని ఆయన కోరారు .కార్యక్రమం లో సుబ్బయ్య కొత్తూరు పాల్గొన్నారు

## కోట కందుకూరులో వైసీపీని వీడి టిడిపిలో చేరికలు

### పార్టీలో చేరిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





**ఆళ్లగడ్డ ప్రతి అక్టోబర్ 12, నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కోట కందుకూరు గ్రామంలో సుమారు 30 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమపై నమ్మకంతో తిరిగి పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. వీరంతా తమకు కొత్తవారు కాదని, గతంలో కొన్ని కారణాలతో దూరమైన వారు తిరిగి సొంత గూటికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే పాత, కొత్త అనే తేడా లేకుండా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆమె తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తమను నమ్మి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని కందుకూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు ఇప్పుడు పార్టీలో చేరినవారిలో చాందబాషా, మా బాషా, ఆకుల హుసేన్ బాషా, ఆకుల ఖాదర్, సున్నిసా గారి అల్లా బకాష్, మక్బుల్ తోపాటు 30 కుటుంబాల సభ్యులు ఉన్నారు.



## గాయత్రీ దేవిగా శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారు





**మహానంది అక్టోబర్ 12 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో శ్రీ అంకాల పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండవ రోజు అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు రామ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకార్చనలు, చండీ హోమం, కుంకుమార్చన, మహా మంగళహారతులు మరియు వైభవంగా పల్లకి సేవలు నిర్వహించారు.ఈ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పూజాదాతగా పులిబండ్ల రామయ్య వ్యవహరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఏపీ స్థానిక ఎన్నికలు..

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఆజు) కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు.

# క్యూఆర్ కోడ్ పి జి ఆర్ ఎస్ సేవలపై జిల్లా అధికారులు ప్రజలలో విస్తృత అవగాహన వచ్చేలా చర్యలు తీసుకోవాలి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబరు 12 నంది పత్రిక** క్యూ ఆర్ కోడ్ పి జి ఆర్ ఎస్ సేవలపై ప్రజలలో విస్తృత అవగాహన వచ్చేలా చర్యలు తీసుకోవాలనిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి. గ్లోరియా, కలెక్టరేట్ కె ఆర్ ఆర్ సి. డిప్యూటీ కలెక్టర్ బి పి ప్రభాకర రావు, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై. దోసి రెడ్డి, డ్వామా పిడి డా. కె సి హెచ్ అప్పారావు, ప్రజల నుండి 81 పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులు 26 రెవెన్యూ క్లినిక్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ లో స్వీకరించిన ప్రతి అర్జీని జవాబుదారితనంతో పరిష్కరించాలి అన్నారు . ప్రజలకు మరింత సేవలను అందించాలని, పి జి ఆర్ ఎస్ సేవలను క్యూ ఆర్ కోడ్ ద్వారా వినియోగించుకోవడం వల్ల ప్రజలకు మరింత సులభతరంగా మారుతుందని, ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు పరిష్కరించడం లో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి, ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రెవిన్యూ, పంచాయతీరాజ్,సర్వే, మున్సిపల్, ఎండోమెంట్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఫిషరీస్ , ఎడ్యుకేషన్, ఇరిగేషన్, తదితర శాఖలు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ఐ–గాట్ కర్మయోగి పోర్టులో ఆయా శాఖల అధికారులు సిబ్బంది శిక్షణ కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేసి పోర్టర్లో పురోగతిని మెరుగు పరచాలని అన్నారు , అక్షరాంధ్ర క్లాసులు నిర్వహణలో హాజరు శాతం పెంచాలని సంబంధిత జిల్లా అధికారులతో పాటు డివిజన్ మండల స్థాయి అధికారులను వర్చువల్ గా ఆదేశించారు. 2027 మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి అదనపు బోధన, పునశ్చరణ తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని సూచించారు.

**పి జి ఆర్ ఎస్ లో స్వీకరించిన కొన్ని ఫిర్యాదులు**

వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామం నుండి జవ్వాది ఝాన్సీ వరలక్ష్మి, తన 60 సెంట్లు భూమి, మరియు అలివేలు మంగతాయారు 1.40 సెంట్లు మొత్తం 2.50 ఎకరాలకు గాను ఉమ్మడి ఎల్ పి ఎం లో1.47 సెంట్లు భూమిగా నమోదు అయినది. సరిచేసి ఇద్దరు పేరున విడి విడిగా చూపించాలని కోరారు.పాలకోడేరు మండలం శృంగవృక్షం జంగంపేట నుండి తాళ్ల పెద్దిరాజు వృద్ధాప్యంలో ఉన్న తన స్థలమును సరిహద్దు స్థలం చెందిన చోడ దాసి సూర్యారావు, ఆక్రమించుకుని బాత్ రూమ్ నిర్మించుకున్నారు. అడుగుగా దౌర్జన్యం చేస్తున్నాడు చర్యలు తీసుకుని తన స్థలం తనకు ఇప్పించాలని కోరారు. పెనుగొండ గ్రామం నుండి వరం శెట్టి పాండురంగారావు సిద్ధాంతంలో సర్వే నెంబరు 335–2 నందు 50 సెంట్లు జిరాయితీ భూమి సంబంధించి రిజిస్ట్రేషన్ కొరకు వెళ్లగా గజా లో భూమి ఉంది రిజిస్ట్రేషన్ గజాలలో చెయ్యాలి అని రిజిస్ట్రేషన్ అధికారులు మాకు అంటున్నారు. తన భూమి వరి పంటగా ఉన్నందున జిరాయితీ భూమిగా మార్పు చేయాలని కోరారు. ఆకివీడు మండలం కోళ్ల పర్రు గ్రామం నుండి నాశీగడ్డ రాముడు గ్రామపంచాయతీలో పని చేస్తున్న తనకు ఇవ్వవలసిన జీతం నిలుపుదల చేసి గ్రామ కార్యదర్శి ఇబ్బందులు పెడుతున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. గణపవరం మండలం మొయ్యరు గ్రామం నుండి ఈద వెంకటలక్ష్మి 2019 సంవత్సరంలో ప్రభుత్వం వారు తనకు ఇండ్ల స్థలము కేటాయించగా వేరే వారు ఆక్రమించుకొని తనపై దౌర్జన్యం చేస్తున్నారని తన స్థలం తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు వయోవృద్ధుల ట్రిబునల్ కమిటీ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బిజెపి జోడితో సమృద్ధిగా అభివృద్ధి



## మరో 15 సంవత్సరాలు కూటమి పార్టీలదే అధికారం 15వ డివిజన్లో రూ.29 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల జోడితోపాటు బిజెపి సహకారంతో రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ చెప్పారు.సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ లో రుద్రభూమి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రుద్రభూమి రోడ్డతోపాటు ఆ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులకు రూ.29 కోట్ల అంచనాలతో పనులను శాసనసభ్యులు గద్దె రామమమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టులు చేపడతారని అందుకు హైదరాబాద్ హైటెక్ సిటీ నిర్మాణమే నిదర్శనమని తెలిపారు. ఇప్పుడు అమరావతిలో 33 వేల ఎకరాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సేకరించి ప్రజా రాజధానిని నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో హ్యామ్ (హైబీడ్ అన్యూటీ మోడల్) పద్ధతిలో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని రామలింగేశ్వర నగర్ ఈ పద్ధతిలో నేడు పలు రోడ్లకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని వివరించారు. హ్యామ్ పద్ధతిని చేపట్టడంతో ఇంటర్నేషనల్ స్థాయి కాంట్రాక్టర్లు నగరంలో రోడ్ల నిర్మాణానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దార్శనికత, పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ కలిస్తే రాష్ట్రంలో మరో 10–15 ఏళ్ల పాటు సమృద్ధిగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ ఇద్దరి కలయికను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ఖజానా ఉండేదని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన సమర్థవంతమైన పాలనలో మొదటి తేదీనే ఉద్యోగులందరికీ జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా మొదటి తారీఖున జీతాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు, స్థానిక సంస్థల్లో కూడా కూటమి అధికారంలో ఉండడం వల్ల మూడో ఇంజిన్ ను కూడా కలిసి రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వ విజయాల ద్వారా మన పిల్లలకు మంచి భవిష్యత్తు, యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, సంక్షేమ కార్యక్రమాలు మరింత బలంగా అమలవుతాయని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. అందువల్ల ప్రజలందరూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా నగర ప్రజలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి రమేష్, గాదిరెడ్డి అమ్ములు, ముమ్మనేని ప్రసాద్, కట్టెంపూడి శేషుబాబు, ఈశ్వరరావు, ఉమ్మడిశెట్టి బహుదూర్, నందమూరి పూర్ణచంద్రరావు, గద్దె రమేష్, సట్టు శ్రీను కార్పొరేషన్ ఇ.ఇ. రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బొల్లారం గేటెడ్ కమ్యూనిటీలో చిన్నారి దారుణ హత్య.. మాజీ సెక్యూరిటీ గార్డు అరెస్ట్

సికింద్రాబాద్ బొల్లారంలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ దారుణానికి పాల్పడింది అదే కమ్యూనిటీ మాజీ సెక్యూరిటీ గార్డు విక్రమ్ కుమార్ అని, అతడిరి అరెస్ట్ చేశామని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి సోమవారం ప్రకటించారు. ఉద్యోగం నుంచి తొలగించారన్న పగతో పాటు, డబ్బుల కోసం చిన్నారిని కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని ఆమె తెలిపారు.ఆదివారం విల్లా ఆర్కిడ్స్‌లోని క్లబ్‌హౌస్ సెల్లార్‌లో ఉన్న వాటర్ సంప్‌లో చిన్నారి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీహార్‌కు చెందిన విక్రమ్ కుమార్‌ను ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు అరెస్ట్ చేశారు.

**పోలీసు కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

కమిషనర్ సుమతి మీడియా సమావేశం నిర్వహిస్తుండగా, చిన్నారి తల్లిదండ్రులు, కమ్యూనిటీ నివాసితులు పోలీసు కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. “చిన్నారికి న్యాయం చేయాలి“, “నిందితుడిని కఠినంగా శిక్షించాలి“ వంటి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ, తక్షణ న్యాయం జరగాలని కోరారు. వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించిన డీసీపీ సి.హెచ్. శ్రీధర్, చట్ట ప్రకారం ముందుకెళతామని, ఈ కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. “మనం నాగరిక సమాజంలో ఉన్నాం. చట్టప్రకారం నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తాం“ అని కమిషనర్ సుమతి స్పష్టం చేశారు.

**అసలేం జరిగింది?**

శనివారం సాయంత్రం క్లబ్‌హౌస్ సమీపంలో సైకిల్ ఆడుకుంటున్న చిన్నారిని విక్రమ్ కిడ్నాప్ చేశాడని పోలీసులు తెలిపారు. రాత్రి 7 గంటలైనా పాప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు.

# కల్లూరు అర్బన్ లో రూ 40 లక్షల అభివృద్ధి పనులకు భూమి పూజ

### శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు అర్బన్ 34 వ వార్డ్ శ్రీనివాస నగర్ లో రూ 40 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని పాణ్యశీ ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ,శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యురాలు శివమ్మ, వార్డ్ నాయకులు పియు మాదన్న, జవ్వాజి గంగాధర్ గౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, రఫీ, మున్సిపల్ అధికారులు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అమ్మవారి శాలలో దేవి నవరాత్రి ఉత్సవాలు

### అన్నపూర్ణ దేవి అలంకారంలో అమ్మవారు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారి శాలలో ఆదివారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజు సోమవారం నాడు ఆలయ అర్చకులు అమ్మవారిని శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేద పండితులు ఆధ్వర్యంలో కలిసస్థాపన, స్వస్తి పుణ్య వాచనము, గణపతి పూజ, నవగ్రహ మంటపారాధన నిర్వహించారు. అలంకార సేవలో తోటం శెట్టి లక్ష్మీనారాయణ దంపతులు పద్మావతి కుటుంబ సభ్యులు శ్రీ వెంకట నాగేంద్ర ట్రేడర్స్ చాటకొండ వెంకటసుబ్బయ్య దంపతులు పాల్గొన్నారు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మూల విరాట్ కు పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ఈ ఉత్సంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి... ఎస్సై నాగేంద్ర ప్రసాద్



**చాగలమర్రి అక్టోబర్ 12 నంది పత్రిక** శాంతిభద్రతలకు ప్రజలు కూడా సహకరించాలని సోమవారం నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై నాగేంద్ర ప్రసాద్ కోరారు. విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజారెడ్డి బదిలీ కాగా జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు చాగలమర్రి మండల ఎస్సైగా బదిలీ కావడం జరిగిందని ఆయన తెలిపారు. చాగలమర్రి పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది ఘనంగా ఆహ్వా నించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా జీవించేలా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిగా ఉంచామని మట్కా, గుట్కా, పేకాట, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి ని కలిసిన ఆత్మకూరు శ్రీ వెంకటేశ్వర స్వామిదేవస్థానంకమిటీ



**నంది పత్రిక ఆత్మకూరు** ఈరోజు ఆత్మకూరు పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆత్మకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన కమిటీ సభ్యులు శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కమిటీ సభ్యులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శిల్పా చక్రపాణి రెడ్డి గారు, అన్నదాన కార్యక్రమానికి తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలుపై రైతులతో జాయింట్ కలెక్టర్ ముఖాముఖి

### రైతుల సందేహాలను అడిగి తెలుసుకున్న కె.ఆర్. కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రాబోయే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎదురయ్యే సమస్యలు, ధాన్యం విక్రయానికి సంబంధించిన సందేహాలపై చర్చించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టే దిశగా రైతులతో మాట్లాడారు.రైతులకు ధాన్యం విక్రయ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, కొనుగోళ్లకు సంబంధించి తమకు ఉన్న సందేహాలను సంబంధిత అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్ సరోజ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, పౌరసరఫరాల డిఎం ఇబ్రహీం, రైతులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు సౌకర్యవంతమైన దర్శనమే లక్ష్యం...





**సామాన్య భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు**

**భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు భద్రతకు పెద్దపీట**

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా**

**ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు**

**రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్**

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శన అనుభవాన్ని అందించేందుకు దేవస్థానం, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ సోమవారం ఇంద్రకీలాద్రి పై మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా అమ్మవారి దర్శనం కలిగించడంతోపాటు గౌరవ రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూలా నక్షత్రం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అమ్మవారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. వీఐపీ భక్తులతో పాటు సామాన్య భక్తులందరికీ ప్రాధాన్యతనిస్తూ, భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్నారన్నారు.

**భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు**

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారన్నారు. భక్తులు ఎక్కువసేపు ఇబ్బందులు పడకుండా దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాన్నారు.

**భద్రతకు ప్రాధాన్యత నిరంతర పర్యవేక్షణ**

ఉత్సవాల సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తగిన బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

**.భక్తులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**

నవరాత్రి ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, భద్రతతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని అందించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు



# ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కలిగి ఉండాలి...

**జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ**



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 12 నంది పత్రిక** తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలో రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం కొనుగోలు విధానం, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్ సరోజ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, డిఎం ఇబ్రహీం, రైతులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంలో శ్రీ మహా లక్ష్మమ్మ అమ్మ వారు.

**శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వారి దేవస్థానంలో 12-10-2026 తేదీ సోమవారం జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి.**



12-10-2026 తేదీన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా, శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ధర్మకర్తల మండలి చైర్మన్ ఎల్ల నాగయ్య పర్యవేక్షణ లో జరిగాయి. ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు, అర్చక స్వాములు, మరియు భక్తులు అతిశయంగా మరియు ఘనంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం (12-10-2026) దేవస్థానంలో నిర్వహించిన విశేష పూజలు మరియు కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి చతుస్థానార్చన: పూజకు సంబంధించిన శక్తిని, దైవత్వాన్ని నాలుగు స్థానాలలో ఆవాహన చేసి పూజించడాన్ని 'చతుస్థానార్చన' అంటారు. ఆ నాలుగు స్థానాలు: కుంభం (కలశం), మండలం (యంత్రం/సర్వతోభద్ర మండలం), అగ్ని (హోమ గుండం), మరియు బింబం (విగ్రహం/మూర్తి) పూజ జరిపించారు. విశేష తిరుమంజనం (మూలమూర్తి): దేవాలయంలోని ప్రధాన దైవానికి (మూలవిరాట్టుకు) పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పండ్ల రసాలు, గంధం, పన్నీరు, పంచామృతాలు మరియు పవిత్ర జలాలతో చేసే దివ్యమైన అభిషేకాన్ని 'తిరుమంజనం' పూజలు నిర్వహించబడ్డాయి. అర్చనారాధనలో భాగంగా మంత్రోచ్చారణ చేస్తూ స్వామి లేదా అమ్మవారి నామాలను (అష్టోత్తరం/సహస్రనామం) పఠిస్తూ పువ్వులు, తులసి లేదా కుంకుమతో భక్తిశ్రద్ధలతో పూజించడం మరియు నైవేద్యం, ధూపదీపాలను సమర్పించడం జరిగింది. వేదపారాయణం: సమాజ శ్రేయస్సు, శాంతి కోసం ప్రాచీన వేద పండితులు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం మరియు అధర్వణ వేదాలలోని పవిత్ర మంత్రాలను స్వరయుక్తంగా పఠించడం జరిగింది. మూల మంత్రం, శ్రీ లక్ష్మీ నారాయణ హవనం:మూల మంత్రం: నిర్దిష్ట దైవానికి సంబంధించిన అత్యంత శక్తివంతమైన జప మంత్రం పఠించడం జరిగింది. శ్రీ లక్ష్మీ నారాయణ హవనం: సంపద, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం మరియు ముక్తి కోసం శ్రీమన్నారాయణుడు మరియు లక్ష్మీదేవిలను ఆవాహన చేస్తూ అగ్నిదేవుని ద్వారా హవిస్సులను (సమిధలు, నెయ్యి, ద్రవ్యాలు) సమర్పించే పవిత్ర హోమం జరిపించారు. సహస్ర దీపాలంకరణ సేవ: వేల సంఖ్యలో (సహస్రం అంటే 1000) ప్రమిదలలో దీపాలను వెలిగించి, ఆ దివ్యమైన వెలుగుల మధ్య ఉత్సవ మూర్తులను ఊయలలో ఉంచి జరిపే అత్యంత కంటికింపుగా ఉండే ఉత్సవ సేవ జరిగింది. లలితా సహస్రనామ కుంకుమార్చన: శ్రీ లలితా పరాభట్టారిక దేవి యొక్క 1000 నామాలను (లలితా సహస్రనామాలు) ఒక్కొక్కటిగా పఠిస్తూ, అమ్మవారికి లేదా యంత్రానికి శ్రేష్ఠమైన ఎర్రటి కుంకుమతో పూజ చేయడం జరిగింది. శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారం, వాహన సేవ:అలంకారం: దేవీ నవరాత్రులలో అమ్మవారిని చిన్నారి రూపమైన, శక్తివంతమైన 'శ్రీ బాలా త్రిపుర సుందరి'గా పట్టు వస్త్రాలు, ఆభరణాలు మరియు పూలతో అలంకరించడం జరిగింది..వాహన సేవ: అలంకరించిన ఉత్సవ మూర్తిని ప్రత్యేకమైన వాహనం (సింహ, హంస, గరుడ మొదలైనవి) పై వేంచేపు చేసి ఆలయ ప్రాంగణంలో లేదా వీధులలో ఊరేగించడం జరిగింది.

# ఎప్పుడూ ఏదో ఒకటి తినాలనిపిస్తుందా? ఈ విషయాలు తెలుసుకుంటే క్రేవింగ్స్‌కు చెక్ పెట్టొచ్చు!

**ఆకలి లేకున్నా ఆహారం గురించే ఆలోచించడం ఫుడ్ నాయిస్**

**ఒత్తిడి, విసుగు, ఒంటరితనం కోరికలను పెంచే అవకాశం**

**ఆహారాన్ని చూడటం, వాసన కూడా ఫుడ్ తినాలని ప్రేరేపించే ఛాన్స్**

**కఠినమైన భోజన నియమాల వల్ల పోషకాలు తగ్గి క్రేవింగ్స్ వచ్చే అవకాశం**

**ప్రొటీన్, ఫైబర్ ఉన్న సమతుల ఆహారం తీసుకుంటో క్రేవింగ్స్ కంట్రోల్**

భోజనం చేసిన కొద్దిసేపటికే మళ్లీ ఏదైనా తినాలనిపిస్తోందా? ముఖ్యంగా స్వీట్లు, చిప్స్ వంటి చిరుతిళ్ల గురించి పదేపదే ఆలోచిస్తున్నారా? శారీరకంగా ఆకలి లేకపోయినా ఆహారం తినాలనే ఆలోచనలు వెంటాడటాన్ని 'ఫుడ్ నాయిస్' అంటారు. ఇది వైద్యపరమైన వ్యాధేమీ కాదు. అయితే ఈ అలవాటు ఆహారపు ఎంపికలపై ప్రభావం చూపొచ్చు. దీని వెనుక ఉన్న కారణాలను గుర్తించి.. కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే ఆహారంపై అనవసరమైన ఆలోచనలను తగ్గించుకోవచ్చు.

**ఒత్తిడి.. బోర్ కొట్టడం కూడా కారణాలే!**

ఒత్తిడి, ఒంటరితనం, విసుగు, మానసిక అలసట ఉన్నప్పుడు కొందరు ఆహారం ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందాలని చూస్తారు. ఇష్టమైన ఆహారం తినడం వల్ల మెదడులో ఆనందాన్ని కలిగించే రసాయనాల ప్రభావం ఏర్పడుతుంది. దీంతో ఆకలి లేకపోయినా మళ్లీ తినాలనే కోరిక కలగవచ్చు. రుచికరమైన ఆహారాన్ని చూడటం, వాసన పీల్చడం లేదా దాని గురించి ఆలోచించడం కూడా ఈ కోరికను పెంచవచ్చు.



**భోజనం మానేయడం.. నిద్రలేమితోనూ సమస్యే!**

బరువు తగ్గాలనే ఉద్దేశంతో భోజనం మానేయడం, అతిగా ఆహార నియంత్రణ పాటించడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి, పోషకాలు అందకపోవచ్చు. ముఖ్యంగా ప్రొటీన్, ఫైబర్ తక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండకపోవచ్చు. దీంతో తరచూ చిరుతిళ్లు తినాలనే కోరిక కలుగుతుంది. మరోవైపు, తగినంత నిద్ర లేకపోవడం ఆకలిని నియంత్రించే హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేసి తీపి పదార్థాలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహారాలపై ఆసక్తిని పెంచవచ్చు.

**ఫుడ్ నాయిస్‌ను తగ్గించుకోవడం ఎలా?**

ఆహారంపై పదేపదే వచ్చే ఆలోచనలను తగ్గించుకోవడానికి బ్యాలెన్స్‌డ్ ఫుడ్ తీసుకోవడం ముఖ్యం. ప్రొటీన్, ఫైబర్ సమృద్ధిగా ఉండే పదార్థాలను భోజనంలో చేర్చుకోవాలి. భోజన సమయాలను వీలైనంత క్రమబద్ధంగా పాటించాలి. ఆకలి వేసినప్పుడు తినకుండా ఉండటం లేదా అతిగా డైటింగ్ చేయడం మంచిది కాదు. ఏదైనా తినాలనిపించినప్పుడు ఒకసారి ఆగి.. నిజంగా ఆకలిగా ఉందా? లేక ఒత్తిడి, విసుగు లేదా అలసట కారణంగా తినాలనిపిస్తోందా? అని ప్రశ్నించుకోవాలి. నెమ్మదిగా తినడం, ఆహారం రుచి మీద దృష్టి పెట్టడం, తగినంత నిద్రపోవడం కూడా ఉపయోగపడతాయి. తరచూ ఆహార ఆలోచనలు వస్తూ రోజువారీ జీవితాన్ని ఇబ్బంది పెడితే వైద్య నిపుణులు లేదా అర్హత కలిగిన పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

# ఎవరీ నేహా బోరా? గూగుల్‌లో ఈమె గురించి తెగ సెర్చ్ చేస్తున్నారు!

**నేహా బోరా స్వస్థలం ఉత్తరాఖండ్‌లోని ఖటిమా**

**ఢిల్లీ హిందూ కళాశాలలో సోషియాలజీ విద్య**

**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో పీజీ**

**జేఎన్‌యూలో థియేటం స్టడీస్‌పై పరిశోధన**

**ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు**

ఢిల్లీలో ఎన్నికల అక్రమాల ఆరోపణలపై జరుగుతున్న నిరసనలతో విద్యార్థి నాయకురాలు నేహా బోరా పేరు ఒక్కసారిగా చర్చలోకి వచ్చింది. 29 ఏళ్ల నేహా బోరా అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు. ఈ వారాంతంలో ఢిల్లీలో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో ఆమె కూడా నిర్బంధానికి గురయ్యారు. దీంతో ఆమె వయసు, స్వస్థలం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు గూగుల్‌లో పెద్ద ఎత్తున వెతుకుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఖటిమాకు చెందిన నేహా బోరా విద్యాభ్యాసం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి నుంచి ఢిల్లీ వరకు సాగింది. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న హిందూ కళాశాలలో సోషియాలజీ చదివారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఢిల్లీలో పీజీ విద్యను అభ్యసించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో థియేటర్, పెర్ఫార్మెన్స్ స్టడీస్ విభాగంలో డాక్టోరల్ పరిశోధన కూడా చేశారు. వారాంతంలో ఆమెపై గూగుల్ సెర్చ్‌లు పెరిగి సోమవారం ఉదయం గరిష్ఠ స్థాయికి చేరినట్లు సమాచారం. నాటకరంగంతో మొదలైన ఆమె ప్రయాణం క్రమంగా విద్యార్థి రాజకీయాల వైపు మళ్లింది. 2019-2020లో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి నిరసనల్లో పాల్గొన్న తర్వాత రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా మారారు. ఏఐఎస్ఏలో చేరి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. విద్య, విద్యార్థుల సమస్యలు, సామాజిక అసమానతలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై ఆమె ప్రసంగాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. ఢిల్లీలో నిరసనకారులు జంతర్ మంతర్ వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఢిల్లీ హాట్ వద్దకు చేరి తిరిగి అందరూ ఒక దగ్గరకు రావాలని నేహా సూచించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అనంతరం సోషల్ మీడియాలో వీడియో విడుదల చేస్తూ.. "నేను నిర్బంధంలో ఉన్నాను. ఉద్యమం మాత్రం ఆగలేదు" అని ఆమె పేర్కొన్నారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల ద్వారా నిరసనల స్థితిని, తదుపరి కార్యాచరణను మద్దతుదారులకు తెలియజేస్తున్నారు.



## భారత్‌లోకి చొరబడేందుకు యత్నం.. మందుపాతర పేలి లష్కరే కీలక కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి!

జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్‌ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్-నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్‌ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

**దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం**

**రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం**

**అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు**

**రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన**

**ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు**

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com